Follow: @ANNTELUGU
10-02-2026
# మహా పత్రిక
తెలుగు
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 43 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఫలితాలకు ముందే ఓటమిని ఒప్పుకున్న సీఎం

ఓటమి భయంతోనే బీజేపీపై అవాకులు, చెవాకులు

ఎంఐఎంతో డీల్ కుదిరిందా? లేదా? సమాధానం చెప్పాలి

కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము లేదని రేవంత్ లేఖ రాయాలి


వాళ్ల సంగతి మేం చూసుకుంటాం

సీఎం వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్

**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ కు ముందే కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మున్సిపాలిటీలకు నిధులివ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారన్నారు. ఇంటెలిజెన్స్, సర్వేల ద్వారా సమాచారం తెప్పించుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఓటమి ఖాయమనే ఫ్రస్ట్రేషన్ తో బీజేపీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు..

మిగతా 2లో

### టాప్ న్యూస్



**లోక్ సభ స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం**

- నేడు అధికారికంగా లేఖ

02



**డిపాజిట్లు రావనే పవన్ ప్రచారానికి రాలే**

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్
- పవన్ కు కొత్త ప్రొడ్యూసర్ మోదీ

02



**సిరిసిల్ల మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతోంది**

- ఫ్రస్టేషన్ లోనే కేటీఆర్ శాపనార్థాలు
- టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

02

# 2029లోనే జమిలి ఎన్నికలు

**కొత్త నియోజకవర్గాలు, మహిళా రిజర్వేషన్లు ఉండే అవకాశం.. చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

బీజేపీకి దేవుడు రాముడు కాదు అసదుద్దీన్ ఓవైసీ.. బీజేపీ లైఫ్ లైనే ఎంఐఎం

కవిత జైలుకెళ్తే.. హరీశ్, కేటీఆర్ సీఎం అవుదామని చూస్తున్నారు

రంజిత్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తానని చెప్పలేదు.. బీఆర్ఎస్ పార్టీని యాసిడ్ పోసి కడిగేయాలి



**హైదరాబాద్, మహా :** ఇన్నాళ్లు కీలక పదవులన్నీ కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉన్నాయని తెలంగాణలోని సకల దరిద్రాలకు బీఆర్ఎస్ పార్టీనే కారణం అని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ మళ్లీ ఈ రాష్ట్రంలో మొలకెత్తకుండా యాసిడ్ పోసి కడిగేయాలన్నారు. జనగణన ప్రక్రియలో భాగంగా వచ్చే ఏడాది మార్చి వరకు జిల్లాల సరిహద్దులు మార్చడానికి అవకాశమే ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠి నిర్వహించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగవని 2029లోనే జమిలి ఎన్నికలు ఉంటాయని సీఎం అభిప్రాయపడ్డారు. జనాభా ప్రతిపాదికన జరిగే డీలిమిటేషన్ వల్ల మనకే నష్టమని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి జిల్లాల పునర్వ్యవస్థీకరణ లేదని వెల్లడించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో జనగణన, కులగణన, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, మహిళ రిజర్వేషన్లు, జమిలీ విధానం అంశాలు ప్రధానంగా ప్రభావం చూపుతాయని రేవంత్ రెడ్డి అన్నారు. భాష విషయంపై స్పందిస్తూ సందర్భానుసారంగా మాట్లాడాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని తీవ్రమైన పదజాలంతో మాట్లాడారన్నారు. వారి నేపథ్యం ప్రకారం చూస్తే ఇప్పటికి వచ్చిందే చాలా పెద్ద అవకాశమని, అధికారం పోయాక తెలంగాణ తమ సొత్తు అన్నట్లు వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ఏళ్ల తరబడి పాలించిన చక్రవర్తులు కూడా అధికారం కోల్పోయిన సందర్భం ఉందని ప్రక్రియను ఎవరైనా అంగీకరించాల్సిందేనన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే అక్కడి నుంచి 42 పైసలు మాత్రమే వస్తున్నాయన్నారు.

మిగతా 2లో



## ప్రచారానికి తెర పంపకాల ఎర

- మెదక్ జిల్లాలో ఓటుకు లక్ష పంచిన కౌన్సిలర్ అభ్యర్థి
- ఒక్క వార్డులోనే కోటిన్నర ఖర్చు
- చాలా మునిసిపాలిటీల్లో రూ.500 నుండి 2వేల దాకా పంపిణీ
- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు రేపే పోలింగ్
- 25 వేల మంది పోలీసులతో బందోబస్తు

వివరాలు 2లో

# సిట్‌లు.. తిట్లు

**ఇదేనా రేవంత్ పాలన.. బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్**




**సిద్దిపేట, మహా :** గత ప్రభుత్వంపై వరుసగా సిట్‌లు వేయడం, ఇష్టానుసారంగా తిట్టడం ప్రజల కడుపు నింపబోవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 19 మున్సిపాలిటీలు ఉన్నాయని, ఖచ్చితంగా మెజారిటీ మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు ఏం చేశామో చెప్పాలి.. చేయబోతున్న పనుల గురించి వివరించాలి అన్నారు. అంతేకానీ పొద్దున లేస్తే కేసీఆర్ ను పట్టుకుని బూతులు మాట్లాడటం తప్ప మరేం లేదన్నారు.

## ఎవరైనా కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం

**11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా!**

చందాలు.. దందాలు చేస్తే.. కింద పడుద్ది జాగ్రత్త!

ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి పొంగులేటి 'స్ట్రాంగ్ వార్నింగ్'



**ఖమ్మం, మహా:** "రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా... ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదు. 11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.. హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా. చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం.. చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయం" అని

మిగతా 2లో

## మా జిల్లాకు మంత్రి పదవి కావాలి

- నా కులమే అడ్డయితే రాజీనామా చేస్తా...
- మరో సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తా
- ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా :** మంత్రి పదవిపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడానికి కులమే అడ్డయితే రాజీనామా చేయడానికి కూడా వెనుకాడనని అన్నారు. మరో సామాజికవర్గానికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తానని అధిష్టానానికి హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత తప్పకుండా రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అన్నారు. రంగారెడ్డి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని, ఈ ప్రాంత ప్రజల కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. మంత్రివర్గ విస్తరణలో స్థానం దక్కించుకునేందుకు కాంగ్రెస్‌లోని పలువురు నేతలు పోటీ పడుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేకపోవటంతో ఆ జిల్లాకు చెందిన నేతలకు త్వరలోనే జరగబోయే

మిగతా 2లో

## శరద్ పవార్‌కు అస్వస్థత

**ఆసుపత్రికి తరలింపు**



**ముంబై, మహా:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ (85) అస్వస్థతకు గురయ్యారు. గత కొద్దిరోజులుగా గొంతు నొప్పితో పాటు తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న ఆయనను, సోమవారం మధ్యాహ్నం బారామతిలోని తన నివాసం నుండి పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌కు తరలించారు. గత రాత్రి నుండి పవార్ గొంతు ఇన్ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్నారు. దగ్గు తగ్గకపోవడం, ఛాతీలో కాస్త పట్టేసినట్లు అనిపించడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఆయనను అంబులెన్స్‌లో పుణెకు తీసుకువచ్చారు. రూబీ హాల్ క్లినిక్ మేనేజింగ్ ట్రస్టీ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ ఈ విషయాన్ని వెల్లడించారు. "పవార్ గారికి గొంతు సమస్య, దగ్గు ఉన్నాయి.

మిగతా 2లో



## 'జూబ్లీహిల్స్'లో ఎవరి వల్లో మేము గెలవలేదు

**అక్బరుద్దీన్‌కు శ్రీధర్‌బాబు కౌంటర్**

**కరీంనగర్, మహా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎంఐఎం మద్దతుతోనే కాంగ్రెస్ విజయం సాధించిందని.. తాము మద్దతు ఇవ్వకపోతే పరిస్థితి ఏంటో కాంగ్రెస్ పెద్దలకు కూడా తెలుసని ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎవరి వల్లో మేము గెలవలేదు.. కాంగ్రెస్ బలంతోనే గెలిచామని స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు రేయింబవళ్లు కష్టపడితేనే విజయం సాధ్యమైందని చెప్పారు. మా పాలనను చూసి ప్రజలు గెలిపించారు.. తామే గెలిపించామని అనుకుంటే పొరపాటే అని అక్బరుద్దీన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు.

## రెడ్డి అయినా.. రావు అయినా సీఎంగా ఎవరున్నా మా వద్దకు రావాల్సిందే..

- ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ
- మా మద్దతు లేకుంటే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచేదా అని నిలదీత



**కరీంనగర్, మహా :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత, గత ముఖ్యమంత్రులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న అక్బరుద్దీన్ ఓవైసీ సోమవారం ప్రచారం ముగింపు రోజున కరీంనగర్‌లో మాట్లాడుతూ, ముఖ్యమంత్రుల వద్దకు తాము వెళ్లం అని.. వాళ్లే తమ వద్దకు వస్తారని పేర్కొన్నారు. అది రెడ్డి అయినా.. రావు అయినా తమ దగ్గరికి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. తాము ముఖ్యమంత్రుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని.. పనులు కావాలన్నా, అధికారం కావాలన్నా సీఎంలే తమ వద్దకు రావాల్సి ఉంటుందని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు. తమ సపోర్ట్ లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎంఐఎం పార్టీ మద్దతు అనేది రాష్ట్రంలో కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదని పేర్కొన్న అక్బరుద్దీన్ ఓవైసీ.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకి ఉందని తెలిపారు.

మిగతా 2లో



# 2029లోనే జమిలి ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

యూపీ రూపాయి చెల్లిస్తే అక్కడి నుంచి 2 వస్తున్నాయన్నారు. బిహార్ రూపాయ చెల్లిస్తే అక్కడి నుంచి 6 రూపాయలు వస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు.

**ట్యాపింగ్ కేసులో అందుకే జాప్యం**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభాకర్‌రావు 20 నెలలు విదేశాల్లో ఉన్నారని చెప్పారు. ఆయన్ను భారత్‌కు తీసుకురావడానికి కేంద్రం సహకరించలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని తెలిపారు. ఆ తర్వాతే కేసు విచారణ వేగవంతమైందన్నారు. రంజిత్ రెడ్డిని మంత్రిని చేస్తా అని నేను చెప్పలేదని నా వ్యాఖ్యల్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారన్నారు. మున్సిపల్ మంత్రిగా నిధులు ఇచ్చి అభివృద్ధి బాధ్యత రంజిత్ రెడ్డికి ఇస్తాను అని చెప్పానని స్పష్టత ఇచ్చారు.

**బీజేపీ దేవుడు ఒవైసీ**

బీజేపీ నాయకులకు అసదుద్దీన్ ఒవైసీ దేవుడు అని వీళ్లంతా పైకి రాముడి పేరు చెబుతారు కానీ రోజు దండం పెట్టుకునేది మాత్రం ఒవైసీకి అన్నారు. రాముడి పేరు ఎన్ని సార్లు తలుచుకున్నారో తెలియదు కాని ఒవైసీ పేరు తలుచుకోకుండా రోజు వీళ్లకు రోజు గడవదన్నారు. వీళ్ల లైఫ్ లైనే ఎంఐఎం అన్నారు. అన్ని మీ చేతుల్లో ఉన్నప్పుడు ఒవైసీని ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ దేశంలో మిగతా రాజకీయ పార్టీల మాదిరిగానే ఎంఐఎం కూడా ఓ రాజకీయ సంస్థ. ఇంకెంత కాలం ఆ పార్టీని బూతంగా చూపించి ఓట్లు అడుగుతారని నిలతీశారు. కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టి, కొంత మంది రాజకీయ నాయకులను బూతంగా చూపిస్తూ రాజకీయ మనుగడ సాగించాలనేది వారి భావదారిద్ర్యానికి పరాకాష్ట అన్నారు. ఈ భావదారిద్ర్యాన్ని చూసి బీజేపీకి ఓట్లు వేయాలా తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.

**ప్రతి ఒక్కరూ బూత్ కు వచ్చేలా చూడాలి**

మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ఎవరైనా కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు.ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రచార పర్వంలో ప్రత్యర్థుల తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు. "ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతాం. మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరు. మీ దందాలకు, దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలి.. అశాంతి సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతాం" అని స్పష్టం చేశారు. రంగురంగుల కండువాలు వేసుకుని వస్తున్న నాయకులను మంత్రి సూటిగా నిలదీశారు. "అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలి. అధికారంలో ఉన్న మేమే పనులు చేయగలం. ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారు? పదేళ్లు అధికారంలో ఉన్న ఆ 'దొర'లకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదు" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్త రేషన్ కార్డులు, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు.

**ఏప్రిల్ లో రెండోవిడత**

వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని మంత్రి ప్రకటించారు. "ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా" అని హామీ ఇచ్చారు. మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామని, వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. సభ అనంతరం వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నాయుడు పేట సర్కిల్ వరకు వేలాది మందితో జరిగిన భారీ ర్యాలీలో మంత్రి పొంగులేటి గారు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# డిపాజిట్లు రావనే పవన్ ప్రచారానికి రాలే..

- **జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్**
- **పవన్ కు కొత్త ప్రొడ్యూసర్ మోదీ**



**జడ్చర్ల, మహా :** తెలంగాణలో ప్రచారం చేసినా డిపాజిట్లు కూడా రావని తెలిసే పవన్ కల్యాణ్ తన పర్యటనని రద్దు చేసుకున్నారని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్‌కు ప్రొడ్యూసర్ చంద్రబాబు, కో ప్రొడ్యూసర్ లోకేష్, తెలంగాణకు వచ్చేందుకు కొత్త ప్రొడ్యూసర్ మోదీని వెతుక్కున్నాడని సెటైర్ వేశారు. జనసేన ఆంధ్రా పార్టీ అని అక్కడి నుంచి తెలంగాణకి వచ్చి పెత్తనం చేస్తామంటే ఇక్కడి జనాలు ఊరుకోరన్నారు. ఆంధ్రవారు కేవలం మన దగ్గర ఉన్న భూములు, నిధుల కోసమే వస్తున్నారు తప్ప మనమీద ప్రేమతోకాదన్నారు. తెలంగాణ ప్రజల నర దిష్టి వల్లే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని మా సెంటిమెంట్ పై మాట్లాడిన పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పమని అడిగినా ఈ రోజుకూ క్షమాపణ చెప్పలేదని పవన్ కల్యాణ్‌కు బాగా ఈగో అని విమర్శించారు. అయినా కొండగట్టుకు వస్తే రాష్ట్ర అతిథిగా గౌరవం ఇచ్చామన్నారు.

# సిరిసిల్ల మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతోంది

- **ఫ్రస్టేషన్ లోనే కేటీఆర్ శాపనార్థాలు**
- **టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి**



**హైదరాబాద్, మహా :** కారుకు ఓటేయకపోతే కళ్ళు పోతాయని కేటీఆర్ శాపనార్థాలు పెడుతున్నాడని, టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు. సిరిసిల్ల మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతున్నదన్న ఫ్రస్టేషన్ లో ఆయన మాట్లాడుతున్నాడన్నారు. ఆయనకు వయసు పెరిగింది కానీ విజ్ఞత లేదని విమర్శలు గుప్పించారు. సోమవారం గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సామా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ మానసిక పరిస్థితి సరిగా లేదు..కేటీఆర్ సైకలాజికల్ గా ఇబ్బంది పడుతున్నాడు..తప్పుడు మెడిసిన్ తీసుకోవడం వల్లే కేటీఆర్ అలా మాట్లాడుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు.. దీని కోసం మెడిసిన్ పంపుతున్నట్లుగా ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టేదాక కేటీఆర్ ఆగేలా లేరని, ఆ పార్టీ నాశనం కావడానికి కారణం కేటీఆర్ .. కేటీఆర్ పక్కన ఉన్న అనేక నాయకులు పొట్టిగా ఉన్నారని సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యక్తిగత దూషణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి..గజ్వేల్, సిరిసిల్లాలో ప్రజలు బీఆర్ఎస్ నేతలను తరుముతున్నారు.. ప్రజలు తరిమితే మల్లన్న సాగర్ లో మునిగిన హరీష్ మంచిర్యాలలో తేలారని సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ మానసిక పరిస్థితిని బీఆర్ఎస్ నాయకులు అర్థం చేసుకోవాలని, కోర్టు పరిధిలో ఉన్న ఆధారాలను తగలబెట్టారని ఆరోపణలు చేయడమేంటి? సిరిసిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందన్నారు.

# ప్రచారానికి తెర.. పంపకాల ఎర

- **మెదక్ జిల్లాలో ఓటుకు లక్ష పంచిన కౌన్సిలర్ అభ్యర్థి**
- **ఒక్క వార్డులోనే కోటిన్నర ఖర్చు**
- **చాలా మునిసిపాలిటీల్లో రూ.500 నుండి 2వేల దాకా పంపిణీ**
- **116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు రేపే పోలింగ్**
- **25 వేల మంది పోలీసులతో బందోబస్తు**



**తెలంగాణ బ్యూరో, మహా :** దాదాపు రెండు నెలలుగా సాగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది. ప్రచార గడువు ముగియడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎన్నికల మైకులు బంద్ అయ్యాయి. ఈనెల 11వ తేదీన రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లలో 414 వార్డు డివిజన్లకు 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి 12,930 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం.. 8,203 పోలింగ్ కేంద్రాలను రెడీ చేసింది. మొత్తం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి 52 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయనున్నారు. ఈనెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టగా ఈనెల 14వ తేదీన మేయర్, ఛైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక ఈనెల 16వ తేదీన ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఏడు నగరపాలికలు, 116 పురపాలికలు కలిపి మొత్తం 123 మున్సిపల్, కార్పొరేషన్ల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 25,62,639 మంది పురుష ఓటర్లు కాగా.. మహిళా ఓటర్లు 26,80,014 మంది ఉన్నారు. సాధారణంగా ఏ ఎన్నికల్లో అయినా మహిళల కంటే పురుషుల ఓటర్ల సంఖ్య అధికంగా ఉంటుంది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండటం విశేషం. పురుషులు, మహిళలు మాత్రమే కాకుండా మరో 640 మంది ట్రాన్స్‌జెండర్లు కూడా ఈ ఎన్నికల్లో తమ ఓటును వేయనున్నారు. మరోవైపు.. ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ మున్సిపల్ ఎన్నికల కోసం ఏకంగా 16,031 బ్యాలెట్ బాక్స్‌లను రెడీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. వీరితోపాటు 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ కోసం 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు.. 31,428 మంది ఇతర సిబ్బంది మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత.. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసింది.

**పంపకాల ఎర**

ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అభ్యర్థులు ముందస్తుగానే డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మెదక్ జిల్లా జిన్నారం మునిసిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో ప్రధాన పార్టీ తరఫున పోటీ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంటికి రూ.లక్ష చొప్పున వార్డులో మొత్తం 150 కుటుంబాలకు రూ.కోటిన్నర పంపిణీ చేస్తానని పేర్కొంటూ ఓటర్లను ఆశీర్వదించాలని కోరారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఓ పార్టీ అభ్యర్థి ఇంటింటికీ నామినేషన్ వేయగానే చీరలు పంపిణీ చేయగా, ఇపుడు రెండోవిడత నగదు అందించినట్లు తెలిసింది. కొన్నిచోట్ల ఇంటికి కేజీ మటన్, ఒక క్వార్టర్ బాటిల్ పంపిణీ చేస్తున్నారు. కొన్ని మునిసిపాలిటీల్లో ఓటుకు రూ.500 నుండి వేయి చొప్పున పంపిణీచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని పలు మునిసిపాలిటీలలో ఓటుకు రూ.10వేలు దాకా అభ్యర్థులు స్థోమతను బట్టి పంపిణీచేస్తున్నారు.

**25 వేల మంది పోలీసులతో బందోబస్తు**

సుమారు 25 వేల మంది పోలీసులతో రాష్ట్రవ్యాప్తంగా నిఘాను ఏర్పాటు చేశారు. మరీ ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల వద్ద అదనపు బలగాలను మోహరించనున్నారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నికల సంఘం అధికారులు స్వయంగా పోలింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించవచ్చు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,930 మంది అభ్యర్థులు కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ ముగిసిన తర్వాత.. ఓట్ల లెక్కింపును ఫిబ్రవరి 13వ తేదీన చేపట్టి.. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14వ తేదీన కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు.. మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 16వ తేదీన కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారంతోపాటు.. ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. దీంతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ప్రచారంలో భాగంగా రాష్ట్ర నేతలతోపాటు జాతీయ నేతలు కూడా కాంగ్రెస్, బీజేపీ పార్టీ అభ్యర్థుల తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో గత కొన్ని రోజులుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పుడు ప్రచారం ముగియడంతో అంతా నిశ్శబ్దంగా ఉంది. తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

# ఫలితాలకు ముందే ఓటమిని ఒప్పుకున్న సీఎం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తనను కలిసిన మీడియా ఛానళ్లతో మాట్లాడుతూ వారు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. రెండేళ్ళ కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు నయాపైసా ఇచ్చారా? గ్రామ పంచాయతీలకు నిధులిచ్చారా? కేంద్రం నిధులు మంజూరు చేసిందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదు? పైగా ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదు. ఉద్యోగుల బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెన్ ఫిట్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పై కోపంతో కాంగ్రెస్ కు ఓటేసి గెలిపిస్తే రెండేళ్లలో కాంగ్రెస్ బండారం బయట పడిందన్నారు. ఆ పార్టీ సంగతి అర్థమైంది కాబట్టే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారని చెప్పారు. ఒవైసీని తాను దేవుడిలా తలుస్తున్నట్లు సీఎం చెప్పడంపై తనదైన శైలిలో స్పందిస్తూ సీఎం, ఒవైసీ మాట్లాడుతున్న స్క్రిప్ట్ ఒకటే. మొన్న ఒవైసీ కరీంనగర్ వచ్చి బండి సంజయ్ కు తన భార్య కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని చెప్పారు. ఇవాళ సీఎం కూడా బండి సంజయ్ ను ఒవైసీని దేవుడిలా చూస్తారని చెప్పారు. బహుశా ఇద్దరి స్క్రిప్ట్ దారుస్సలాంలోనో లేక గాంధీభవన్ లో ప్రిపేర్ అవుతున్నట్లుందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ కుదిరిందా? లేదా? కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులకు డబ్బులు ఇవ్వకుండా ఎంఐఎం అభ్యర్థులకు ఎందుకు పంపిస్తోంది? ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థులే కోపంగా ఉన్నారు కదా? దీనికి ఎందుకు సమాధానం చెప్పడం లేదు? అని ప్రశ్నించారు. ఎవరు నాగుపాము? ఎవరు జెర్రిపోతో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పిన బండి సంజయ్ బీఆర్ఎస్ అనే నాగుపామును ప్రజలను ఖతం చేశారని, రేపు జెర్రిపోతులాంటి కాంగ్రెస్ కు కూడా అదే గతి పట్టబోతుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీఎం తన చేతగానితనాన్ని ఇతరులపై నెట్టడం అలవాటైందని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టులో సరైన వాదనలు వినిపించే దమ్ములేదు. సీఎంగా రేవంత్ ఉండగానే కదా ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోయింది. మరి పారిపోతుంటే ఏం చేశారు? తప్పించుకోవడానికి ఇవన్నీ డ్రామాలాడుతున్నారు. సీఎంను అడుగుతున్నా "నాకు చేతగాదు, నాకు ఆవేశం లేదు. రోషం, పౌరుషం లేదని, కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము అసలే లేదని కేంద్రానికి లేఖ రాయండి. అప్పుడు మేం ఏం చేస్తారో మీరే చూస్తారని బదులిచ్చారు.

# లోక్ సభ స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

## నేడు అధికారికంగా లేఖ



**ఢిల్లీ, మహా :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు నిర్ణయం తీసుకున్నామని, ఈ అవిశ్వాస తీర్మానానికి తనతో పాటు పలువురు ఎంపీల ఇప్పటికే సంతకాలు చేశారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్‌కు అధికారికంగా లేఖ సమర్పించనున్నట్లుగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి వెల్లడించారు. సోమవారం మల్లు రవి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య విలువలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలో చైనా భారత్ భూభాగంలోకి ఏ విధంగా చొరబడిందనే అంశాలను స్పష్టంగా ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ అంశాలను లోక్‌సభలో ప్రస్తావించేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయత్నిస్తే బీజేపీ సభ్యులు అడ్డుకుంటున్నారని మల్లు రవి ఆరోపించారు. లోక్‌సభ స్పీకర్ పార్లమెంట్ లో ప్రజాస్వామ్యాన్ని పక్కనపెట్టి బీజేపీ అజెండాను ముందుకు నడిపిస్తున్నారని, సభను తరచూ వాయిదా వేస్తూ, పార్లమెంటరీ నియమ నిబంధనలను పాటించడం లేదని ఆయన అన్నారు.

# రెడ్డి అయినా.. రావు అయినా సీఎంగా ఎవరున్నా మా వద్దకు రావాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నెలల క్రితం జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తమ మద్దతు లేకుండానే కాంగ్రెస్ పార్టీ గెలిచిందా అని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సాధించిన విజయంలో ఎంఐఎం పాత్ర కీలకమని దాన్ని హస్తం పార్టీ నేతలు మర్చిపోకూడదని పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. ఎంఐఎం పార్టీ అవసరం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ.. ఎంఐఎం బ్రదర్స్ (అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ) సత్తా ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గుర్తు చేసిన అక్బరుద్దీన్ రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పార్టీ కింగ్ మేకర్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా అద్భుత ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తమ పార్టీ బలం ఏంటో ప్రత్యర్థులకు చూపిస్తామని ఎంఐఎం కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి.. అత్యధిక వార్డులను దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# శరద్ పవార్‌కు అస్వస్థత



(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం మా వైద్యుల బృందం ఆయనకు అన్ని రకాల పరీక్షలు చేస్తోంది. రిపోర్ట్స్ వచ్చిన తర్వాత, ఆయనను ఆసుపత్రిలో ఉంచాలా లేక మందులు ఇచ్చి ఇంటికి పంపాలా అనేది నిర్ణయిస్తాం" అని ఆయన పేర్కొన్నారు.

**అజిత్ మరణంతో ఒత్తిడి**

శరద్ పవార్ గతంలో క్యాన్సర్‌ను జయించిన వారు కావడంతో, గొంతుకు సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులు చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు. దానికి తోడు, ఇటీవల తన అన్న కొడుకు అజిత్ పవార్ ఆకస్మిక మరణం ఆయనను మానసిక ఒత్తిడికి గురిచేసిందని, ఆ ప్రభావం కూడా ఆరోగ్యంపై పడి ఉండవచ్చని కార్యకర్తలు భావిస్తున్నారు.

# మా జిల్లాకు మంత్రి పదవి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పిస్తారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో మల్‌రెడ్డి రంగారెడ్డి లేదంటే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలలో ఒకరికి మంత్రి పదవి దక్కే ఛాన్స్ ఉందన్న ప్రచారమూ జరిగింది. అయితే, అనూహ్యంగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పరిగి వేదికగా చేసిన వ్యాఖ్యలతో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత రంజిత్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు ఖాయమైనట్లు ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డి అప్రమత్తమై అధిష్టానానికి కీలక సందేశం ఇచ్చారు.



## మునిసిపల్ ఎన్నికల వేళ

# కాంగ్రెస్‌కు షాక్

## బీఆర్ఎస్‌కు ఓటేయమన్న గూడెం మహిపాల్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల వేళ పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చి సంచలనం సృష్టించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్న మహిపాల్ రెడ్డి కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలోనూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తను కాంగ్రెస్ చేరడం వల్ల చిల్లీగవ్వ లాభం చేకూరలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వారిని బీఆర్ఎస్‌కు ఓటువేయాలని కోరడం గమనార్హం. అయితే.. కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న మహిపాల్ రెడ్డి, పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి సహా కొందరు అనుచరులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమ నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనాలు రాలేదన్న కారణంతో మహిపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరతారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన మహిపాల్ రెడ్డి.. ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

- **అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం**
- **మాస్ ఎక్స్‌క్లూజన్ జరగకూడదన్న పశ్చిమ బెంగాల్ వాదనపై సుప్రీంకోర్టు స్పందన**



**న్యూఢిల్లీ, మహా :** ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవడానికి అనుమతించబోమని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సహించబోమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఆ విషయంలో అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. పశ్చిమ బెంగాల్ లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వివాదాల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని, అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోయే అవకాశముందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారీగా ఓట్ల తొలగింపు జరగొచ్చన్న అభిప్రాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన సీజేఐ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకి రానివ్వమని, ఇది రాష్ట్రాలన్నీ గమనించాలని స్పష్టం చేశారు.

**డీజీపీకి కోర్టు ఆదేశాలు**

విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం (ఈసీ) సమర్పించిన అఫిడవిట్‌ను కోర్టు పరిశీలించింది. ఎన్నికల అధికారులు జారీ చేసిన నోటీసులను కొందరు దుండగులు కాల్చివేశారని ఈసీ ఆరోపించింది. ఇప్పటివరకు ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కూడా తెలిపింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ విషయంపై వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పశ్చిమ బెంగాల్ డీజీపీకి కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**అధికారుల చేతుల్లోనే**

కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తిస్తుంది. ఎన్నికల ప్రక్రియను ఎవరూ దెబ్బతీయకూడదు" అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహాయంగా ఉపయోగించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 8,505 గ్రూప్‌బి అధికారుల జాబితాను ఎన్నికల సంఘానికి అందజేసింది. వీరికి శిక్షణ ఇచ్చి అవసరమైన చోట వినియోగించవచ్చని కోర్టు సూచించింది.

# నాయకులం కాదు మేం ప్రజా సేవకులం

- 8వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా అల్లం శ్యామల శ్యామ్
- 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కర్నే నాగరాజు




**తొర్రూర్ మహా;** తొర్రూర్ పట్టణ పరిధిలో జరిగే మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు సోమవారం రోజు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కర్నే నాగరాజ్ ప్రచారం జోరుగా నిర్వహించారు. మాట్లాడుతూ మొదటి నుండి మా కుటుంబం 11 వార్డ్ ప్రజలకు నిరంతరం కృషి చేసిన వారము అని అన్నారు. యథావిధిగా వార్డు ప్రజలు ఒక అవకాశం ఇస్తే అభివృద్ధిని చేసి చూపిస్తామని తెలియజేశారు. అదేవిధంగా టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి 8వ వార్డు సభ్యులు అల్లం శ్యామల, శ్యామ్ మేము మొదటి నుండి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అనుసంధానంగా ఉంటూ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ వార్డు కొరకు నిరంతరం కృషి చేసామని తెలిపారు ఈ వార్డు ప్రజలు యువకులు మహిళలు గుర్తించి ఆలోచించి ఓటు ద్వారా అవకాశం ఇచ్చినట్లు అయితే అభివృద్ధి చేసుకుంటామని వారి మామ అల్లం అర్జున్ రాజు తెలిపారు అంతేకాకుండా ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. అభివృద్ధికి ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య కళాశాలలో కీచక ఉపాధ్యాయుడు

**ఘట్ కేసర్, మహా :** అన్నోజిగూడలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన గురువే కీచకుడిగా మారాడు. తన దగ్గర చదువుకుంటున్న మైనర్ బాలికపై కన్నేసి, ప్రేమ పేరుతో వంచించి, రహస్యంగా పెళ్లి చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించినప్పటికీ, నిజం ఎక్కువ రోజులు దాగదు కాబట్టి అసలు విషయం బయటపడింది.

**అసలు ఏం జరిగింది**

పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ ఎల్ఐజీ కాలనీ మార్గంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో పత్రే మైటీన్ (27) భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ మైనర్ విద్యార్థినిని అతను తన మాటలతో ట్రాప్ చేశాడు. ఈ క్రమంలోనే ఆ బాలికకు మాయమాటలు చెప్పి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. ఇంట్లో ఉన్న సమయంలో విద్యార్థిని మెడలో పసుపు తాడు (తాళి) ఉండటాన్ని గమనించిన తల్లి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. కూతురిని గట్టిగా నిలదీయగా, తన ఫిజిక్స్ టీచర్ పత్రే మైటీన్ తనను పెళ్లి చేసుకున్నాడని అసలు నిజం ఒప్పుకుంది. దీంతో కంగుతిన్న తల్లిదండ్రులు తక్షణమే పాఠశాల ప్రిన్సిపల్‌ను ఆశ్రయించారు. తల్లిదండ్రుల నిలదీతతో మొదట తనకు ఏమీ తెలియదని ప్రిన్సిపల్ బుకాయించే ప్రయత్నం చేశారు. అయితే, సదరు ఉపాధ్యాయుడిని పిలిపించి అడగగా, అవును, నేను ఆమెను ఇష్టపడి పెళ్లి చేసుకున్నాను అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. విషయం బయటకు పొక్కితే పాఠశాల పరువు పోతుందని భావించిన యాజమాన్యం, గోప్యంగా ఉంచుతూనే నిందితుడిని పోలీసులకు అప్పగించారు.



బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు పత్రే మైటీన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నమ్మకంతో చదువు కోసం పంపిస్తే, కూతురి జీవితాన్ని నాశనం చేశాడు. ఇటువంటి కీచక గురువులకు కఠిన శిక్ష పడాలి" అని బాధితురాలి తల్లి దండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థినుల భద్రతపై ఈ ఘటన మరోసారి చర్చకు దారితీసింది. యాజమాన్యం ఇలాంటి విషయాలను దాచిపెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# అధికారికంగా ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2026 కార్యక్రమం

**పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2026 కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో సోమవారం అధికారికంగా ప్రారంభించారు. వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, ఐఏఎస్ పోస్టర్ ఆవిష్కరణ ద్వారా ఫైనాన్షియల్ లిటరసీ వీక్-2026 ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ కార్యాలయం, వరంగల్ ఆధ్వర్యంలో హవేలి రాజు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికిజి సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), టి సుమ, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, వరంగల్, ఉమా రాణి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, నర్సంపేట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించడంలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులు, డిజిటల్ లావాదేవీలలో జాగ్రత్తలు, కేవైసీ నవీకరణ అవసరం, ఆర్థిక మోసాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫైనాన్షియల్ లిటరసీ వీక్-2026 సందర్భంగా వరంగల్ జిల్లాలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో బ్యాంకుల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు, గ్రామసభ ఆధారిత ప్రచారాలు మరియు ఖాతాదారుల సమావేశాలు నిర్వహించి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించిన ఆర్థిక అవగాహన సందేశాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయనున్నట్లు తెలిపారు.

# అంతర్రాష్ట్ర యువజన సమ్మేళన ముగింపు విజయవంతం

**బల్దియా కమీషనర్ చాహత్ బాజ్పాయి**




**హన్మకొండ మహా;** మేరా యువ భారత్ వరంగల్ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల పాటు అంతర్రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమం ఈ నెల 5 నుంచి 9 వరకు హనుమకొండ బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో విజయవంతంగా జరిగింది. సోమవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అంతర్రాష్ట్ర సమ్మేళనంలో కేరళ రాష్ట్రానికి చెందిన 37 మంది యువతీయువకులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అవగాహన చేసుకోవడం, చారిత్రక ప్రదేశాల సందర్శన ద్వారా వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడం, ఇతర రాష్ట్రాల యువత తమ సంస్కృతిసంప్రదాయాలను స్థానిక యువతకు పరిచయం చేయడం, జాతీయ సమైక్యతను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్పాయి మాట్లాడుతూ, విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశంలో యువత దేశభక్తి భావంతో జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని అన్నారు యువత నైతిక విలువలను నేర్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా సేవా రంగాలపై కూడా యువత దృష్టి సారించాలని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో యువత మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, సాంఘిక రుగ్మతలపై ప్రజలను చైతన్యం చేయవలసిన అవసరం ఉందని, ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మొబైల్ అడిక్షన్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నడపబడుతున్న జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఖాజా మసియోద్దీన్ మాట్లాడుతూ యువత నైపుణ్యాలను అలవర్చుకుంటేనే భవిష్యత్ లో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం కేరళ రాష్ట్రం నుండి పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు మరియు మెమొంటోలను ప్రధానం చేశారు.

# పీఎం శ్రీ స్కూల్స్ అభివృద్ధి పై జిల్లా స్థాయి సమీక్ష

- నాణ్యమైన విద్యా తో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ మహా;** వ్యాప్తంగా పీఎం శ్రీ స్కీమ్ కింద ఎంపికైన 16 పాఠశాలల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పిఎం శ్రీ స్కూల్స్ నిర్వహణలో ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తానని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తహసీల్దార్లు ఎంపీడీవోలతో ప్రత్యేక తనిఖీ నిర్వహించిన అనంతరం రూపొందించిన నివేదికల ఆధారంగా ఈ సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రంగయ్య నాయుడు, డీబీసీడీఓ పుష్పలత, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మి, డిహెచ్ఎస్ఓ శ్రీనివాసరావు, సంబంధిత మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, జీసీడీఓ ఫ్లోరెన్స్, పీఎం శ్రీ పాఠశాలల హెడ్‌మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యాబోధన స్థాయి, పాఠశాలల పరిసరాల శుభ్రత-పరిశుభ్రత, స్పోర్ట్స్ మెటీరియల్, కిచెన్ గార్డెన్లు, మౌలిక వసతుల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. కొన్ని పాఠశాలల్లో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటం, కిచెన్ షెడ్ల నిర్వహణ లోపించడం, టాయిలెట్ల డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ లోపాలను వెంటనే సరిదిద్దాలని, పాఠశాలల్లో విద్యా తో పాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పీఎం శ్రీ స్కూల్స్ తనిఖీల సందర్భంగా తాసిల్దార్లు, ఎంపీడీవోలతో కూడిన ప్రత్యేక అధికారుల ద్వారా ఆకస్మిక తనిఖీ నివేదికలు సేకరించి, వీడియోలు, ఫోటోల ఆధారంగా సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణ తీరు ఆశించిన స్థాయిలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉండాలని, లేనిపక్షంలో బాధ్యత వహించాల్సిన హెడ్‌మాస్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎం శ్రీ స్కూల్స్ నిర్వహణపై వారం రోజుల్లో మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అప్పటివరకు పీఎం శ్రీ పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో మౌలిక సదుపాయాలు, శానిటేషన్, కిచెన్ గార్డెన్లు, యోగా టీచర్ల తరగతులు తదితర పీఎం శ్రీ స్కీమ్ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను మెరుగుపరిచేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పీఎం శ్రీ స్కూల్స్ లక్ష్యాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, గుర్తించిన లోపాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

# మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి...

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం రోజు కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... పోలింగ్ మరియు కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు వంటి ప్రత్యేక వర్గాల ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కౌంటింగ్ హాలులో టేబుల్ ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది ఏర్పాట్లు, భద్రత చర్యలు, త్రాగునీరు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బ్యారికేడ్లు వంటి భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధికారులంతా బాధ్యతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి.ఓ సురేష్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# గోపరాజు పల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ భాస్కర్



**వలిగొండ, మహా:** వలిగొండ మండలంలోని గోపరాజు పల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈఓ) సుంకోజు భాస్కర్ సోమవారం పాఠశాలను సందర్శించి పునాది అక్షరాస్యత అధ్యాయనం ఎలా అమలవుతుందని పరిశీలించి తగు సూచనలు చేశారు విద్యార్థులను విద్యా బోధన ఎలా నడుస్తుందని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆర్పి రమేష్ని ఆర్ పి వెంకటేష్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపూర్ కాలనీ పాఠశాలను సందర్శించిన జిల్లా తనిఖీ బృందం



**సంగారెడ్డి ప్రతినిధి: మహా :** సదాశివపేట మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను జిల్లా నోడల్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో జిల్లా ప్యానల్ తనిఖీ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి సురేష్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యా మరియు పరిపాలనకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లు మరియు రికార్డులు అద్భుతంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల పనితీరును మెరుగుపరచడానికి మరియు సంబంధిత అభ్యాస ఫలితాలను సాధించడానికి ఉపాధ్యాయుల బాగా కృషి చేస్తున్నారని, వారి పనితీరు ప్రశంసనీయం అని ఈ సందర్భంగా అన్నారు. పరిశీలించిన విద్యార్థుల 5వ తరగతి తెలుగు, ఆంగ్లం మరియు నాలుగవ తరగతి గణితం బాగున్నాయి అన్నారు. పాఠశాల ప్రాంగణ నిర్వహణ మరియు విద్యార్థుల పరిశుభ్రత పారిశుధ్య సంబంధిత కార్యకలాపాలు మరియు లైబ్రరీ కార్యకలాపాలు బాగున్నాయన్నారు. సంబంధిత టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మరియు ఇతర పోస్టర్లతో తరగతి గదులు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని అన్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన మరియు ప్రశాంత వాతావరణం వున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి సురేష్, టీం సభ్యులు వల్లభ జోషి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఉపాధ్యాయులు నవనీత పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ లో అరాచక పాలన, గుండాగిరి, బెదిరింపు రాజకీయాలను బొంద పెట్టండి

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ జిల్లా మహా:** కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చివరి రోజు 24 వార్డుల BRS పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా భారీ రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం చేసిన మాజీ శాసన సభ్యులుమర్రి ఈ సందర్భంగా మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డిని చూస్తుంటే ఒక సామెత గుర్తొస్తుంది.. బొగ్గును పాలతో కడిగితే తెలుపు రాదు. అలాగే రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీకి పోయినా ఆయన బుద్ధి మారలేదు, భాష మారలేదు. హార్వర్డ్ కు వెళ్లి అక్కడి పరువు తీశాడు. నా ఎత్తు గురించి, కేటీఆర్ ఇంగ్లీష్ గురించి, పేగులులాగులు అంటూ మాట్లాడితే.. అవ్వతాతల కడుపు నిండుతుందా? నీ బూతులతో పేదోడి ఆకలి తీరుతుందా రేవంత్ రెడ్డి మామూలోడు కాదు.. ఏకంగా దేవుళ్లనే మోసం చేశాడు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తానని రాష్ట్రంలోని అన్ని దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పాడు. రావయ్యా రేవంత్ రెడ్డి.. పోలీసులు లేకుండా కందనూలు చౌరస్తాకు రా. ఎవరికి రుణమాఫీ అయ్యిందో, ఎవరికి కాలేదో తేలుతుంది సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో బాండ్ పేపర్ల మీద సంతకాలు పెట్టించి ఆరు గ్యారెంటీలు ఇస్తామన్నారు.

**ఈ రెండున్నరేళ్లలో ఏ ఒక్కటైనా అమలు చేశారా?**

అవ్వతాతలకు రూ. 4000 పెన్షన్ ఇస్తామన్నారు.. ఇచ్చారా? ఆడబిడ్డలకు రూ. 2500, తులం బంగారం ఇస్తామన్నారు.. ఇచ్చారా? రైతుబంధుకు ఎసరు పెట్టారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్.. అన్నీ బంద్ పెట్టారు. నాగర్ కర్నూల్ లో అభివృద్ధి జరిగింది కేసీఆర్ హయాంలోనే. నాగర్ కర్నూల్ మెడికల్ కాలేజీ ఇచ్చింది కేసీఆర్ కాదా? జిల్లా చేసింది కేసీఆర్ కాదా? రోడ్లు బాగు చేసి, ఇక్కడి భూముల విలువ పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లయింది.. నాగర్ కర్నూల్ లో ఒక్క రూపాయి పని చేశారా కేసీఆర్ ఉన్నప్పుడు ఆటో డ్రైవర్ కు చెప్పినా యూరియా బస్తాలు ఇంటికి వచ్చేవి. ఇప్పుడు రేవంత్ రెడ్డి వచ్చాక యూరియా దొరకడమే గగనమైంది. అప్పుడు 24 గంటల కరెంట్ ఉంటే.. ఇప్పుడు 12 గంటలు కూడా సక్కగా ఇస్తలేరు. నాగర్ కర్నూల్ లో గుండాగిరి చేసే వాళ్లు కావాలా..ప్రజలకు సేవ చేసే నాయకులు కావాలా? ఆలోచించుకోండి.మా కార్యకర్తలకు నేను అండగా ఉంటా. వాళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదు. మర్యాదకు మర్యాద.. దేనికైనా సిద్ధం. నా ఇంటికి నీ ఇల్లు ఎంత దూరమో.. నీ ఇంటికి నా ఇల్లు అంతే దూరం. గుర్తుపెట్టుకో అని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు.

# కోనపురి సోదరుల మాతృమూర్తి లక్ష్మమ్మకు ఘన నివాళులు




**నివాళులు అర్పించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డాక్టర్ చెరుకు సుధాకర్**



**వలిగొండ, మహా:** బి ఆర్ ఎస్ పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు సాంబశివుడు, ఆయన సోదరుడురాములు ల మాతృమూర్తి అయిన కోన పూరి లక్ష్మమ్మ ఆదివారం మృతి చెందడం తో సోమవారం వలిగొండ మండలంలోని దాసిరెడ్డిగూడెంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం డాక్టర్ చెరుకు సుధాకర్ హాజరై ఆమె పార్థివదేహానికి నివాళులర్పిస్తూ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు అంతిమయాత్ర పూర్తయ్యేంత వరకు వేముల పుష్ప సుక్క రామనర్సయ్య ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లారు ఈ కార్యక్రమంలో క్రాంతి దళ్ళృద్వి కంచర్ల రామకృష్ణా రెడ్డి మొగుళ్ళ శ్రీనివాస్ సంగిశెట్టి క్రిస్టఫర్ పడమటి దామోదర్ రెడ్డి తుమ్మల వెంకటరెడ్డి కొమురెల్లి సంజీవరెడ్డి పడమటి మమత అయోధ్య కోనపురి కవిత స్వర్ణలత నారి మల్లేష్ నారీ నరసింహ దేగల పాండు అంబటి మోహన్ మాద శంకర్ కొంతం యాదిరెడ్డి జనిగె విష్ణువర్ధన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# ధనవంతులకు కాదు.. గుణవంతులకు ఓటు వేయాలి

- కబ్జాలు, అక్రమాలు కాంగ్రెస్–బీఆర్ఎస్ రాజకీయాలకు చిహ్నం
- ప్రజల నమ్మకమే మా బలం అదే మా విజయం
- అలియాబాద్‌లో బిజెపి ఇంటింటి ప్రచారంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మంజుల వినోద్ యాదవ్ కు మద్దతుగా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గోంగళ్ళ బాలేష్ గారు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ "ప్రజలు ఈసారి ధనవంతులకు కాదు - గుణవంతులకు ఓటు వేయాలి. డబ్బుతో రాజకీయాలు చేసే వాళ్లు కాదు, ప్రజల కోసం పనిచేసే నాయకులకే అవకాశం ఇవ్వాలి"అని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని నిజాయితీగా పనిచేసే అభ్యర్థి మంజుల వినోద్ యాదవ్ గారికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో పాటు, బిజెపికి అనుకూల వాతావరణం స్పష్టంగా కనిపించిందని తెలిపారు.

# భారత్ ఎండీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**డ్యూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ పరిశోధనకు దోహదం**



**కుషాయిగూడ, మహా :** డ్యూచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ పై పరిశోధనను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో భారత్ ఎండీ ఫౌండేషన్ హైదరాబాద్ లోని కాప్రాలో వైద్య శిబిరం నిర్వహించారు. మైసూరు లోని జెఎస్ఎస్ ఆసుపత్రి, జెఎస్ఎస్ మెడికల్ కాలేజ్, జెఎస్ఎస్ ఉన్నత విద్యా పరిశోధనా అకాడమీ సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్యూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీగా నిర్ధారణ అయిన పిల్లలు మరియు వారి తల్లులు పాల్గొన్నారు. పరిశోధనలో భాగంగా రక్త నమూనాలు సేకరించి, డ్యూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీకి సంబంధించిన జీవ సూచికల గుర్తింపు ప్రాజెక్ట్ కోసం వినియోగించారు. ఈ నమూనాలను జె.ఎస్.ఎస్ బృందం పరిశీలిస్తూ, వ్యాధిపై అవగాహన పెంపొందించడం, నిర్వహణలో మెరుగైన విధానాలు అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తోంది. వైద్య పరిశోధనతో పాటు, ఈ శిబిరం కుటుంబాలకు పరస్పరం కలుసుకునే, అనుభవాలను పంచుకునే వేదికగా నిలిచింది. అనుభవం గల తల్లిదండ్రులు కొత్తగా ఈ సమస్యను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేసి ధైర్యం నింపారు. దీంతో డ్యూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న కుటుంబాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం మరింత బలపడింది. ఈ కార్యక్రమం లో సువేత, రితికా చోర్డియా, తన్మయి, చరణ్, సాయి అనురాగ్, సుప్రజ నమాల, రమేష్ యాదవ్, ఆశ్రిత గంటి, మహేశ్రీ అయ్యగారి, సహితి వడ్లమాని, ప్రణతి కర్ర, పల్లవి నాగలక్ష్మి ఆలూరి, నవ్య ఈగా, వెంకట్ రెడ్డి, నదీర్ అమాన్, మహేశ్ ఈగా తదితరులు పాల్గొన్నారు.

# పాతూరి సాధనకు గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ ప్రదానం

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన పాతూరి సాధన కు జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 56, 57, 58వ బ్యాచ్‌ల కంబైన్డ్ కాన్వకేషన్ కార్యక్రమం సోమవారం రాజేంద్రనగర్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతులమీదుగా పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. గమనార్హమైన విషయం ఏమిటంటే, ఆమె ఇదే విశ్వవిద్యాలయంలో బీఎస్సీ, ఎమ్మెస్సీతో పాటు పీహెచ్‌డీ వరకు విద్యను పూర్తి చేయడం. సాధన తల్లిదండ్రులు పాతూరి నరసింహారావు మరియు శారద తమ కుమార్తె సాధించిన ఈ ఘన విజయాన్ని తమ జీవిత కష్టాలకు దక్కిన ఫలితంగా అభివర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, సాధన భర్త మధుర గీత్, మామగారు రవెళ్ల రామారావు (వరంగల్ స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్, లక్ష్మీ మెగా టౌన్షిప్), అత్తయ్య సుగుణ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సాధన భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా ఉన్నత విద్యలో రాణించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు.



ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
10-02-2026
మహా టెక్
04




# సాహో.. సర్వం

## సరికొత్త చరిత్ర సృష్టించిని సర్వం ఏఐ.. ఇదీ భారతీయుడి సత్తా

### ఆర్టిఫిషియల్ రంగంలో సత్తా చాటిన భారత్.. .. చాట్ జీపీటీ, జెమిని లను బీట్ చేసిన మన ఏఐ టూల్స్

**మహా, ప్రత్యేకం:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో ఇప్పటివరకు అమెరికా, చైనా దేశాలదే హవా ఉండగా, ఇపుడు భారత్ నుండి ఓ పెనుతుఫాన్ ఈ ప్రపంచంలో కొత్త చరిత్ర లిఖిస్తోంది. భారత్‌కు చెందిన 'సర్వమ్ ఏఐ' అనే స్టార్టప్ ఏఐ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. గూగుల్ జెమిని, చాట్‌జీపీటీ వంటి గ్లోబల్ దిగ్గజాలకు కొన్ని కీలక విభాగాల్లో షాక్ ఇస్తూ, భారతీయ గడ్డపై తయారైన ఈ 'సర్వం ఏఐ'కి ప్రపంచమంతా సాహో అంటోంది. ఐఐటీ మద్రాస్ మాజీ విద్యార్థులైన ప్రత్యూష్ కుమార్, వివేక్ రాఘవన్ ఈ సంస్థను స్థాపించారు.

### గ్లోబల్ దిగ్గజాలను వెనక్కి నెట్టిన 'సర్వమ్ విజన్'

బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న సర్వమ్ ఏఐ, ఇటీవలే సర్వమ్ విజన్, బుల్‌బుల్ అనే రెండు మెయిన్ టూల్‌స్‌ను రిలీజ్ చేసింది. సర్వం AI టెక్స్ట్-టు-వాయిస్ మార్చే టూల్ కూడా బాగా పని చేస్తోంది. ఇది హిందీ, తమిళం, తెలుగు, మరాఠీతో సహా అనేక భాషలు స్పష్టంగా, సహజంగా మాట్లాడుతుంది. ఇది కాల్ సెంటర్లు, ఆన్‌లైన్ విద్య, ఆడియో వార్తలు, ప్రభుత్వ హెల్ప్‌లైన్‌ల వంటి సర్వీస్‌లో బాగా ఉపయోగపడుతుంది.

### ఖచ్చితత్వం

డాక్యుమెంట్లలోని సమాచారాన్ని గుర్తించే ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ విభాగంలో సర్వమ్ విజన్ అద్భుతాలు చేస్తోంది. ఓసీఆర్ పరీక్షల్లో ఇది 84.3% ఖచ్చితత్వాన్ని నమోదు చేసి, గూగుల్ జెమిని 3 ప్రో, చాట్‌జీపీటీలను వెనక్కి నెట్టింది. సాధారణంగా ఏఐ మోడళ్లు ఇంగ్లీష్ డాక్యుమెంట్లను బాగా చదువుతాయి, కానీ సర్వం ఏఐ భారతీయ భాషలు, సంక్లిష్టమైన టేబుల్స్, సరిగ్గా స్కాన్ చేసి అర్థం చేసుకోవడంలో సూపర్ పని చేస్తోది. ఇది తెలుగు, హిందీతో సహా 22 అధికారిక భారతీయ భాషల్లో అత్యంత ఖచ్చితంగా పనిచేస్తుంది.

### సర్వమ్ ఏఐ ప్రత్యేకతలు:

**బుల్‌బుల్ వీ 3 :**
ఇది టెక్స్‌ట్‌ను వాయిస్‌గా మార్చే మోడల్. ఇది విదేశీ యాప్‌ల కంటే స్వచ్ఛమైన భారతీయ యాసతో మాట్లాడుతుంది. ప్రస్తుతం బుల్‌బుల్ 11 భారతీయ భాషల్లో 35కి పైగా వాయిస్‌లకు మద్దతు ఇస్తోంది. భవిష్యత్తులో ఈ పరిధిని 22 భాషల వరకు విస్తరించాలన్నది సంస్థ లక్ష్యం. భారతీయ ఫాంట్లు, భావప్రధాన ఉచ్చారణకు అనుగుణంగా రూపొందించడంతో ఇది వినియోగదారుల ప్రశంసలు అందుకుంటోంది.

### తక్కువ ధర -ఎక్కువ వేగం:

గ్లోబల్ మోడళ్లతో పోలిస్తే, సర్వమ్ ఏఐ మోడళ్లు భారతీయ డేటాసెట్లపై శిక్షణ పొందడం వల్ల తక్కువ ఖర్చుతో అత్యంత వేగంగా ఫలితాలను ఇస్తాయి.

### ఓపెన్‌హాథీ...

ఇది సర్వమ్ విడుదల చేసిన మొదటి హిందీ ఎల్ ఎల్ ఎం. ఇది అనువాద రంగంలో జీపీటీ-4 కంటే మెరుగైన ఫలితాలు ఇచ్చిందని సంస్థ పేర్కొంది.





### విమర్శల నుంచి ప్రశంసల దాకా...

గతంలో సర్వం ఏఐ భారతీయ భాషలపై దృష్టి పెట్టడాన్ని కొందరు విమర్శించారు. కానీ తాజా ఫలితాలతో ఆ విమర్శలన్నీ మౌనమయ్యాయి. ప్రముఖ టెక్ విశ్లేషకుడు డీడీ దాస్ తన అభిప్రాయాన్ని మార్చుకుంటూ, "సర్వం విషయంలో నేను తప్పుగా అంచనా వేశాను. వారి ఇండిక్ మోడళ్లు ఇప్పుడు నిజంగా విలువైనవిగా మారాయి" అంటూ బహిరంగంగా ప్రశంసించారు. తక్కువ ధరల్లో అత్యుత్తమ టెక్స్ట్-టు-స్పీచ్, స్పీచ్-టు-టెక్స్ట్, OCR సేవలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.





### సావరీన్ ఏఐ

ఏ దేశానికి ఆ దేశం సొంతంగా, తమ ప్రజల అవసరాలకు అనుగుణంగా, తమ సొంత డేటా, వనరులతో నిర్మించుకునే ఏఐనే 'సావరీన్ ఏఐ' అంటారు. భారత్ డేటా భద్రత కోసం విదేశీ కంపెనీలపై ఆధారపడకుండా, సర్వమ్ ఏఐ వంటి సంస్థల ద్వారా తనకంటూ ఓ సొంత ఏఐ వ్యవస్థను నిర్మించుకుంటోంది. భారతీయ ఇంజనీర్లు కేవలం వినియోగదారులుగా మాత్రమే కాకుండా, ప్రపంచ స్థాయి కోర్ ఏఐ టెక్నాలజీని కూడా నిర్మించగలరని సర్వమ్ ఏఐ నిరూపించింది. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా ఒక చారిత్రక విజయమని కేంద్ర ఐటీ శాఖ కూడా ప్రశంసించింది.

### ఇండియన్ ఏఐపై మారుతున్న ప్రపంచ దృష్టి

కిసాన్ ఏఐ వ్యవస్థాపకుడు ప్రతీక్ దేశాయ్ మాట్లాడుతూ, "ఇండిక్ అవసరాలకు మేము బుల్‌బుల్‌ను ప్రధానంగా వాడుతున్నాం. ప్రతి అప్‌డేట్‌తో వారు మరింత మెరుగవుతున్నారు" అని అన్నారు. సాధారణ వినియోగదారులు కూడా "వావ్... ఇది నిజంగా అద్భుతం" అంటూ స్పందిస్తున్నారు. సర్వం ఏఐ విజయాలు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాయి. భారత్ ఇక కేవలం ఏఐ వినియోగదారుడే కాదు... ఏఐ సృష్టికర్తగా కూడా ప్రపంచానికి సవాల్ విసురుతోంది. 'మేడ్ ఇన్ ఇండియా' ముద్రతో, భారతీయ అవసరాలకు తగ్గ సావరీన్ ఏఐ నిర్మాణం దేశ టెక్ భవిష్యత్తుకు కొత్త దిశను చూపిస్తోంది.




# కౌన్ బనేగా కౌన్సిలర్..?

## వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిష్ఠ, ప్రజాభిప్రాయం

**రాజకీయ లెక్కల మధ్య ఉత్కంఠ... రాజన్న నగరంలో ఎన్నికల సందడి**

**ఆలయం నుంచి గల్లీ వరకు చర్చే రాజకీయం... రాజన్న ఆశీర్వాదం ఎవరికి....?**

**ముగిసిన అభ్యర్థుల ప్రచారాలు.. ఓటరు చేతిలో పట్టణ భవిష్యత్తు**




**వేములవాడ మహా:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం ప్రస్తుతం పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లింది. శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ పట్టణంలో భక్తుల రద్దీతో పాటు రాజకీయ హడావుడి కూడా కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, దేవాలయ పరిసరాల నుంచి అంతర్గత కాలనీల వరకూ "ఈసారి కౌన్సిలర్ ఎవరు?" అన్న ప్రశ్నే ప్రధానంగా వినిపిస్తోంది.

**28 వార్డులు – ప్రతి వార్డూ ఓ చిన్న యుద్ధభూమే**

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 28 వార్డులు ఉండగా, ఈసారి ప్రతి వార్డులో పోటీ తీవ్రంగా ఉంది. కొన్ని వార్డుల్లో అధికార పార్టీ ప్రభావం కనిపిస్తుండగా, మరికొన్ని వార్డుల్లో ప్రతిపక్షాలు గట్టి సవాల్ విసురుతున్నాయి. త్రిముఖ పోరు ఉన్న చోట ఓట్ల విభజన కీలకంగా మారగా, ద్విముఖ పోరులో వ్యక్తిగత ఇమేజ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

**పార్టీల ప్రతిష్ఠ – నాయకుల పరపతి పరీక్ష**

ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న కీలక స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో, ఫలితాలు రాబోయే రాజకీయ సమీకరణలకు సూచికగా మారనున్నాయి. అందుకే అగ్రనేతల జోక్యం, ముఖ్య నేతల ప్రచారంతో వేములవాడ రాజకీయ కేంద్రంగా మారింది.

**టికెట్ కోసం పోరు – తిరుగుబాట్ల ముప్పు**

అభ్యర్థుల ఎంపిక దశ నుంచే పార్టీల్లో అసంతృప్తి మొదలైంది. టికెట్ దక్కని కొందరు స్వతంత్రులుగా బరిలోకి దిగడంతో కొన్ని వార్డుల్లో పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ఈ తిరుగుబాటు అభ్యర్థులే ప్రధాన పార్టీల లెక్కలను తారుమారు చేసే అవకాశం ఉందన్న చర్చ కొనసాగుతోంది.

**పనులే ప్రమాణం – అభివృద్ధిపై ప్రజల తీర్పు**

వేములవాడ పట్టణంలో ఈసారి ఎన్నికల ప్రధాన అజెండా అభివృద్ధే. రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, శానిటేషన్ లోపాలు, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై ఓటర్లు స్పష్టమైన ప్రశ్నలు వేస్తున్నారు. "ఐదేళ్లలో ఏం చేశారు?" అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని అభ్యర్థులకు ఎదురుదెబ్బ తప్పదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

**దేవాలయ పట్టణంలో ప్రత్యేక సమస్యలు**

భక్తుల రద్దీ పెరిగే రోజుల్లో ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ లోపాలు, పారిశుధ్య సమస్యలు వేములవాడకు ప్రత్యేక సవాళ్లుగా మారాయి. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలన్న డిమాండ్ ఓటర్ల నుంచి వస్తోంది. ఈ అంశాలపై స్పష్టమైన ప్రణాళికలు చెప్పే అభ్యర్థులపై ప్రజల దృష్టి పడుతోంది.

**డోర్ టు డోర్ ప్రచారం – ఓటరుతో నేరుగా కనెక్ట్**

అభ్యర్థులు ఉదయం నుంచి రాత్రి వరకూ ఇంటింటి ప్రచారంలో బిజీగా మారారు. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, స్థానిక సమస్యలను వినడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు అభ్యర్థులు గతంలో చేసిన పనుల లిస్ట్‌తో ఓటర్ల ముందుకు వెళ్తుండగా, మరికొందరు భవిష్యత్తు హామీలతో ఆశలు రేపుతున్నారు.

**డిజిటల్ ప్రచారం – యువ ఓటర్లే టార్గెట్**

ఈసారి ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పోస్టులు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా అభ్యర్థులు తమ ప్రచారాన్ని విస్తరిస్తున్నారు. ముఖ్యంగా యువత ఓటును దృష్టిలో పెట్టుకుని డిజిటల్ క్యాంపెయిన్‌లకు ప్రాధాన్యం పెరిగింది.

**డబ్బు,ప్రలోభాలపై అధికారుల నిఘా**

ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ, ప్రలోభాలపై ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. ఫ్లయింగ్ స్క్వాడ్లు, చెక్‌పోస్టులతో నిఘా పెంచడంతో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. అయినా, తెర వెనుక లెక్కలు నడుస్తున్నాయన్న చర్చ మాత్రం ఆగడం లేదు. కుల, సామాజిక సమీకరణలు – గణితం తప్పని పరిస్థితిపట్టణం అయినప్పటికీ వేములవాడలో కుల, సామాజిక సమీకరణలు ప్రభావం చూపుతున్నాయి. కొన్ని వార్డుల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు బరిలోకి దిగడంతో పోటీ ఉత్కంఠభరితంగా మారింది. మహిళా రిజర్వేషన్ వార్డుల్లో మహిళా అభ్యర్థుల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగుతోంది.

**సైలెంట్ ఓటర్ – చివరి నిమిషంలో మలుపు**

ప్రచారంలో పెద్దగా పాల్గొనని సైలెంట్ ఓటర్ ఈసారి ఫలితాన్ని నిర్ణయించే కీలక శక్తిగా మారాడు. చివరి రోజు వరకు ఎవరూ అంచనా వేయలేని ఈ ఓటర్ల తీర్పే విజయం, పరాజయాలను తారుమారు చేయనుంది.

**మున్సిపల్ పాలనపై ప్రభావం – కౌన్సిల్ ఎవరి చేతిలో?**

కౌన్సిలర్ల సంఖ్య ఆధారంగా మున్సిపల్ కౌన్సిల్‌పై ఆధిపత్యం సాధించే పార్టీ ఏదన్నది ఆసక్తికరంగా మారింది. ఛైర్మన్ ఎన్నిక, పాలన దిశ అన్నీ ఈ ఫలితాలపైనే ఆధారపడి ఉండనున్నాయి.

**వేములవాడ భవిష్యత్తు ఓటరు చేతిలో....**

దేవాలయ పట్టణంగా గుర్తింపు ఉన్న వేములవాడను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే నాయకత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచేవాడు తన వార్డుకే కాదు... మొత్తం పట్టణానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**అంతిమంగా...**

వేములవాడలో 'కౌన్ బనేగా కౌన్సిలర్?' అన్న ప్రశ్నకు సమాధానం త్వరలో బ్యాలెట్ బాక్స్ చెబుతుంది. ప్రచార శబ్దాల మధ్య ప్రజల తీర్పే చివరి మాట కానుంది.

## కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టండి..



- కరీంనగర్ ను అభివృద్ధి చేసే బాధ్యత మాది..
- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు..
- కరీంనగర్‌లో అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

**కరీంనగర్ మహా :** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టాలని తద్వారా కరీంనగర్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందన్నారు సోమవారం సాయంత్రం కరీంనగర్ లోని 10, 11 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆకుల నర్మదా నరసన్న కోడూరి రవీందర్ గౌడ్ కు మద్దతుగా వినాయక నగర్ లో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ...**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదు, మేము 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్లను జతచేసి వారందరికీ ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యాన్ని 10 లక్షలకు పెంచి పేద ప్రజలకు ప్రభుత్వం పక్షాన వైద్య సహాయాన్ని అందజేస్తున్నాము, రవీందర్ తో పాటు ఆకుల నర్మదా నర్సయ్యకి ఓట్లు వేసి కాంగ్రెస్ కు మరింత బాధ్యతను పెంచడం వల్ల ఇల్లు లేని నిరుపేదలకు మేము తప్పకుండా ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇంకా మరెన్నో సేవలు చేయాలని ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మా సోదరులు మేయరుగా ఎన్నికైన తరువాత తప్పకుండా అన్ని పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. చేసుకుంటున్నాము, ఇల్లు లేని వారికి ఇండ్లు ఇళ్ల స్థలాలు అందిస్తామని తెలిపారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనునిత్యం పెరుగుతున్న వెండి బంగారం ధరలతో ఒక పేదవాడు అర తులము కొద్దిపాటి బంగారము కూడా కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్నారు. పేదల దగ్గర దోచుకుని పెద్దలకు పంచి పెట్టడమే బిజెపి సిద్ధాంతంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండి మరింత బలం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతి పౌరుడు ఒక బాధ్యతగా తీసుకొని తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల నర్మదా నరసన్నతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి అంగడి బజార్, శివాలయం రోడ్ లో గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ సమీరుద్దీన్ అలియాస్ సమీర్ ను సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై గోపతి నరేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి విక్రయాలపై పట్టణంలో గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో భాగంగా సోమవారం అంగడి బజారులో పోలీస్ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సమీరుద్దీన్ అనే వ్యక్తిని సోదా చేయగా అతని వద్ద 165 గ్రాముల డ్రై గంజాయి దొరికిందని వెల్లడించారు. ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కాగా ఇతడి పై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి పంపిస్తున్నట్లు వెల్లడించారు.

## గ్రేటర్ కరీంనగర్‌గా తీర్చిదిద్దుతాం..

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు
- వినూత్న శైలిలో సుడిగాలి ప్రచారం..
- కార్నర్ మీటింగులు.. ఇంటింటా ప్రచారం..బుల్లెట్ పై నగరంలో తిరుగుతూ ప్రచారం..
- ప్రజల నుంచి అనూహ్య స్పందన



**కరీంనగర్ మహా :** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు కావడంతో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావ్ ప్రతి డివిజన్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. వినూత్న శైలిలో ప్రజలను ఆకట్టుకున్నారు. బుల్లెట్ వాహనంపై నగరంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వివిధ డివిజన్లలో రాజేందర్ రావ్ కార్నర్ మీటింగులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. డివిజన్లో ప్రజలు మహిళలు యువకులు, వివిధ వర్గాలకు సంబంధించిన వారంతా పెద్ద సంఖ్యల హాజరై సమావేశాలను విజయవంతం చేశారు. రాజేందర్ రావ్ బుల్లెట్ వాహనంపై తిరుగుతూ నగరం మొత్తం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావ్ మాట్లాడుతూ కరీంనగర్ ను గ్రేటర్ కరీంనగర్ గా మారుస్తామని కరీంనగర్ రూపురేఖలు మారుస్తామని పేర్కొన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా తీగల వంతెన కు మెరుగులు దిద్దుతామని వెలుగులు విరజిమ్మేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో నగరంగా కరీంనగర్ తయారు చేస్తామని ముఖ్యమంత్రి మంత్రుల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు సాధిస్తామని చెప్పారు. అభివృద్ధికి బాటలు వేయాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భూకబ్జాలు దోపిడీలు అవినీతికి పాల్పడి ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అలాంటి వారిని ఎన్నికల్లో బొంద పెట్టాలని మళ్ళీ గెలిపిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది గనుక కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందన్నారు. కరీంనగర్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని రాజేంద్రావు పిలుపునిచ్చారు.



## ప్రచారానికి తెర ప్రలోభాల ఎర

**కరీంనగర్ లో టఫ్ ఫైట్.. త్రిముఖ పోటీ..**

**మేయర్ పీఠంపైనే గురి..**



**మహా :** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. దీంతో ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఓట్ల కోసం నానా తిప్పలు పడుతున్నారు. ముఖ్యమైన నేతలు కార్యకర్తలు డివిజన్లో మంచి పేరు ఉన్న వ్యక్తులతో మంతనాలు జరుపుతున్నారు. అభ్యర్థులు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు చెమటోడ్చి పనిచేస్తున్నారు. నిద్రాహారాలు తిండి తిప్పలు మానుకుంటూ ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఆయా పార్టీల నేతలు మేయర్ పీఠం దక్కించుకోవడం పైనే దృష్టి సారించారు. దీనికోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కరీంనగర్ ఎంపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే కరీంనగర్లో విస్తృతంగా పర్యటించి అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. బిజెపిలో అన్నీ తానై వ్యవహరించారు. గెలుపు బాధ్యతలు భుజాన వేసుకొని అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. 66 డివిజన్లో పెద్ద మొత్తంలో కార్పొరేట్ స్థానం దక్కించుకొని మేయర్ పీఠం అధిరోహిస్తామని బిజెపి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కరీంనగరంలో దాదాపు 3,40,000 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 66 డివిజన్లో ఉన్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్ లో ఎంపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం లేకపోవడంతో మేయర్ స్థానంపై గురి పెట్టింది. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తుంది. ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుద్దిల్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రెండు మూడు రోజులపాటు జిల్లా కేంద్రంలోనే ఉండి అభ్యర్థుల తరఫున విస్తృతంగా ప్రచార నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని తద్వారా కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని వారు స్పష్టం చేశారు. ప్రజలు ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వార్డుల్లోనే తిరుగుతూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. అభ్యర్థుల విజయానికి బాటలు వేస్తున్నారు. టికెట్ల కేటాయింపు నుంచి ప్రచారం వరకు అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలుస్తూ అండగా ఉన్నారు. ఇటీవల కాలంలో రాజేంద్రరావు దూకుడు పెంచారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో గ్రాఫ్ పెరిగింది.. మేయర్ పీఠాన్ని కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ప్రజలంతా తమవైపే ఉన్నారని వెలిచాల రాజేందర్ రావు చెబుతున్నారు. మిగతా కాంగ్రెస్ నాయకులు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ విషయానికి వస్తే బిఆర్ఎస్ నేత మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎన్నికలను తీసుకున్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపు వరకు అన్నీ తానే ముందుండి వ్యవహరిస్తున్నారు గంగుల కమలాకర్. గత బిఆర్ఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మాజీ ఎంపీ బోయిన్పల్లి వినోద్ కుమార్ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమం పూర్తి కావడంతో అభ్యర్థులంతా ఓట్ల వేటలో పడ్డారు. ఓటర్లను మచ్చగా చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్ డివిజన్లను అభివృద్ధి చేసి చూపిస్తామని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా ఎంఐఎం కొన్నిచోట్ల గట్టి పోటీ ఇస్తున్నది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వారి అదృష్టాన్ని పరీక్షించుకుం టున్నారు.. గత ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ముగ్గురు కార్పొరేటర్ గా గెలిచారు. మంగళవారం ఒక్కరోజే ఎన్నికలకు గడువుంది. బుధవారం 11వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్ తీర్పు ఎలా ఉంటుందో చూడాలి మరి. పార్టీకి మేయర్ పీఠం దక్కుతుంది ప్రజలు అండదండలు ఏ పార్టీకి ఉన్నాయో వేచి చూడాలి..



### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**క్యాతన్ పల్లి మహా :** ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు ఈ నేల 11న జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ అభ్యర్థుల ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పోటీ చేసే అభ్యర్థులు వారి సన్నిహితులు పోలింగ్ బూతులకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నియమ, నిబంధనలు పట్టణ వాసులు పాటించాలని పాటించాలని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, ఉల్లంఘించిన వ్యక్తుల మీద చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ పి రమేష్, ఆర్కేపి ఎస్ఐ జే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



### మున్సిపల్ ఎన్నికల్లో మోస పూరిత హామీలను నమ్మి మోసపోవద్దు

**బాకీ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లి, మహా:** ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని బాకీ కార్డులను ప్రభుత్వం ఇదివరకు హామీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో సంబంధించిన బాకీ కార్డులను ఆయా వార్డులలో పర్యటించి ఓటర్లకు బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అందజేశారు. సోమవారం నాడు బెల్లంపల్లి మున్సిపాలిటీ 2వ,4వ,5వ, 9వ, 11వ, 12వ, 13వ, 24వ, 29వ వార్డుల్లో ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీల బాకీకార్డును ఇంటింటికి పంపిణీ చేసి వివరించి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లుగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిపించాలని అభ్యర్థించారు. సంబంధిత ఆయా వార్డులలో పోటీ చేస్తున్న సబ్బని అరుణ్, ఈట కమలలక్ష్మణ్ రావు, గోగర్లస్వప్నసత్యనారాయణ, కాంపెల్లి రాజం, బత్తుల అనసూయమోక్షానందం, తిరుమలవాసు, దొంగల రాజ్ కుమార్, కొత్తూరి వరలక్ష్మిచెన్నకేశవరెడ్డి, రాజులాల్ యాదవ్ గార్ల కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు .



### ఓటు మనందరి బాధ్యత-కలెక్టర్

**ఆదిలాబాద్ మహా :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని, జిల్లాలో వంద పోలింగ్ శాతం నమోదుకు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మాజీ సైనికుల సంఘాల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన స్వీప్ ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, సమాజంలోని అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు.. కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహనపై తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ప్రదర్శించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో ఓటు హక్కు వినియోగిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, వయోవృద్ధులు, దివ్యాంగులు, మాజీ సైనికులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డులలో కంది శ్రీనివాస రెడ్డి సుడిగాలి పర్యటన

**ఒక్కరోజులో 19 వార్డులలో ప్రచారం .. పలు కాలనీలలో రోడ్ షో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి.. అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వెల్లడి**

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దూసుకుపోతున్నారు. కాలనీలలో సుడిగాలిలా పర్యటిస్తున్నారు. ప్రచారానికి చివరి రోజైన సోమవారం ఆయన ఏకంగా 19వార్డులను చుట్టేసారు. ఆయా కాలనీలలో నిర్వహించిన రోడ్ షోలలో వార్డ్ ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అభివృద్ధి చేసింది ఇంకా చేస్తుందన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మహిళలు ప్రజలు చాలా ఆనందంగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు , సన్నబియ్యం పంపిణీ లాంటివి మహిళలకు వరాలన్నారు. ఇంకా ప్రతీ మహిళకు ఆర్థిక చేయూత కింద నెలకు 2500 పథకం త్వరలో ప్రారంభం కానుందన్నారు. వార్డులలో సమస్యలు తీరాలంటే , ఆదిలాబాదం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ నే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష రావు, కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, శాంతన్ రావు, వామన్ వాంఖడే, రాందాస్ నాక్లే, అల్లూరి భూమారెడ్డి, మామిడి మల్లారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 20 నాటికి రైతులు పత్తి విక్రయించాలి

**మంచిర్యాల జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ షాహబుద్దీన్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా రైతులు ఫిబ్రవరి 20 నాటికి తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ షాహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి సి ఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025 26 పత్తి సీజన్ కు సంబంధించి కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో రైతులు తమ సమీపంలోని సి సి ఐ కొనుగోలు కేంద్రాలలో ఫిబ్రవరి 20 లోపు విక్రయించాలని తెలిపారు. ఈ మేరకు ముందస్తు సమాచారం అందించడం జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించి లబ్ధి పొందాలని స్పష్టం చేశారు.



## ప్రచారానికి తెర ప్రలోభాలతో ఓటర్లకు వల...

**బెల్లంపల్లి, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ విజయం కోసం మిగిలిఉన్న చివరి అస్త్రాలపై దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారం ముగిసిన పోలింగ్‌కు మరో 48 గంటల సమయం ఉండటంతో తమవిజయం కోసం వార్డుల్లో స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నం కోసం నానా తంటాలు పడుతున్నారు. బుధవారం వారం బెల్లంపల్లి మున్సిపల్ లోని 34 స్థానాలకు పోలింగ్ జరగనుంది. అయితే ఈ సారి రికార్డ్ స్థాయిలో 66 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండడంతో ప్రధాన పార్టీ లకు రెబెల్స్ బెండద తప్పడం లేదు.ఎలాగైనా మున్సిపల్ లో జెండా ఎగరేయడానికి ప్రధాన పార్టీ ల నాయకులు వార్డుల్లో విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించడంతో పాటు రెబెల్స్ ను బుజ్జగించే ప్రయత్నంచేశారు. ప్రచార పర్వం ముగియడంతో విందు రాజకీయాలకు తెరతీశారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పలువురు అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణికి రంగం సిద్ధం చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం పాల్మకూల్ గ్రామంలో సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్, ఎంపీడీవో మున్నితో కలిసి పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు చేశారు. గ్రామంలోని మహిళా సంఘాల అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు.ఉపాధి హామీ పథకం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 10 లక్షల రూపాయలనిధులతో గ్రామ సమాఖ్య (వి, ఓ) భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.15వ ఆర్థిక సంఘం నిధుల నుండి కేటాయించిన 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న పల్లె దావకాన భవనానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈ( వి,ఓ ) భవనం ఎంతో దోహదపడుతుందన్నారు. నిర్ణీత సమయంలో నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, ఉప సర్పంచ్ గూడెపు కుమార్,వార్డ్ సభ్యులు, సీనియర్ నాయకులు గణేష్ గుప్తా, మహేందర్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్,మహిళా సంఘాల ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అండర్ 19 వరల్డ్ కప్ సాధించిన ఆరోన్ జార్జ్ కి శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అండర్ 19 వరల్డ్ కప్ లో మంచి ప్రతిభ కనబరిచి వరల్డ్ కప్ సాధించిన, అండర్ 19 వరల్డ్ కప్ సభ్యుడు ఆరోన్ జార్జ్ కి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు క్రీడా అభిమానులు స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంతమంతా అభిమానులతో కిక్కిరిసిపోయింది.

# హోరాహోరీగా ప్రచారాలు... ప్రలోభాలు షురూ

### తెల్లవారుజాము నుంచే జనంలోకి ర్యాలీలు, రోడ్‌షోలతో ఓటర్లను ఆకట్టుకునే యత్నం

- సమయానికి ప్రచారాలు బంద్.. చివరి క్షణం వరకు అవిశ్రాంతంగా పర్యటనలు
- ప్రారంభమైన ప్రలోభాల పర్వం.. నగదు,, బిర్యానీ,మద్యం పంపిణి
- ఒక్కో ఓటరుకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకు పంపిణీ
- డిమాండ్ ఉన్న చోట రూ.10 నుండి 15 వేలకు తగ్గని వైనం
- నగదు, మద్యం పంపిణీలో ఒక్కో పార్టీది ఒక్కో విధానం



**ఆమనగల్లు, మహా:** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు చివరి రోజు ప్రచారం జోరు కనిపించింది.ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారంలో దూసుకెళ్లారు.బహిరంగ సభలు, రోడ్‌షోలు, ర్యాలీల్లో పాల్గొని జోష్ నింపారు. ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తూ మరో వైపు వినూత్న ప్రచారాలతో హోరెత్తించారు.. చివరి రోజు నాయకులంతా గల్లి గల్లీ ప్రతి ఇంటిఇంటికి తిరిగారు. ఉన్న కొద్ది సమయంలో ఎక్కువమందిని కలిసి ఓటు అడిగేందుకు పరుగులు పెట్టారు. ఒక్క క్షణం కూడా వృథా కాకుండా చివరి సెకన్ వరకు అవిశ్రాంతంగా వార్డుల్లో పర్యటించారు. ప్రచార సమయం పూర్తి కావడంతో మద్యం, నగదు పంపిణీపై నజర్ పెట్టారు.

**ముగిసిన మైక్...**
**నగదు, మద్యం పంపిణీ షురూ!**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డులలో అభ్యర్థులు రూ.500 నుంచి రూ.3 వేల వరకు ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. మూడు ప్రధాన పార్టీల్లో ఓ ముఖ్య పార్టీ నాయకులు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ఒక్కో ఓటరుకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇతర పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు ఒక్కో ఓటరుకు రూ.3 నుండి 5 వేల వరకు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. మరో పార్టీ రూ.500 నుంచి రూ.1,000 వరకు, మరోపార్టీ రూ.500 పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. నగదే కాకుండా ఒక్కొక్కరికీ ఒక్కో మద్యం బాటిల్ కూడా ఇస్తున్నట్లు ప్రచారమవుతోంది. ప్రధాన రాజకీయ పార్టీ నాయకులు ముందు జాగ్రత్తగా వారం రోజుల కిందటనే ఓటర్లకు పంపిణీ చేసే డబ్బులను గ్రామాల్లో రహస్య స్థావరాలకు చేరవేసినట్లు చెబుతున్నారు.ఓటర్లకు డబ్బులు, మద్యం, కానుకలు పంపిణీ చేసేందుకు సన్నద్ధమమయ్యారు. ఇదిలా ఉంటే, పోలింగ్‌కు ఒకరోజు మాత్రమే గడువు ఉండడంతో వార్డులలో తమ చేతుల్లో గంపగుత్త ఓట్లు ఉన్నాయంటూ కొందరు బేరసారాలకు దిగినట్లు తెలుస్తోంది. కుల సంఘాలతో పాటు వివిధ సంఘాల నాయకులు పార్టీ ముఖ్య నేతలతో బేరసారాలకు దిగుతున్నారు. అందినంత రాబట్టుకోవాలని నాయకులు చూస్తుండగా, ఆ ఓట్లు ఎంత వరకు పడతాయానే పార్టీల నాయకులు ఆలోచనలో ఉన్నారు.

## పోలింగ్ కేంద్ర పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు



**వరంగల్ హన్మకొండ మహా;** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 11వ తేది బుధవారం జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీ లకు జరిగే ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులు గా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేదం 10 తేదీ ఉదయం 6 గంటల నుండి 11 తారీకు రాత్రి 8 గంటల వరకు అమలులో వుంటుందని ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.

## ఆశీర్వదించి గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి చాపల బాపిరెడ్డి**



**తొర్రూర్ మహా ;** మున్సిపల్ ఎన్నికల్లో ఐదో వార్డు కౌన్సిలర్ గా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని చాపల బాపిరెడ్డి అన్నారు, నాపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బలపరిచిందని అన్నారు గతంలో తొర్రూరు గ్రామానికి సర్పంచ్ గా కూడా పనిచేశానని అందుకు తొర్రూర్ లో ఏ అభివృద్ధి అవసరమో ప్రతి విషయంలో నాకు అవగాహన ఉందని, అందుకోసం ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈసారి ఆశీర్వదించి ఆదరించి ప్రజలు గెలిపిస్తే ఐదో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిద్దామని అన్నారు, వాడు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి
- కాంగ్రెస్ పై అసత్య ప్రచారాలు మానుకోండి
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**తొర్రూరు మహా :** తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం తొర్రూర్ లోని కంటేపాలెం రోడ్డు చౌరస్తాలో జరిగిన కార్నర్ సమావేశంలో పాలకుర్తి శాసనసభ సభ్యురాలు మున్సిపల్ ఎన్నికలలో చివరి రోజు కేటీఆర్ వ్యాఖ్యల పై మండిపడ్డారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో 10 సంవత్సరాలు అధికారంలో నుండి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదు. ఈ మధ్యకాలంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలం గడుస్తున్నాడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై అనేక అసత్య ప్రచారాలు చేస్తూ, ముఖ్యమంత్రిని పొట్టోడు పొడుగోడు అని మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తూ పొట్టిగా ఉండడం కాదు వ్యక్తిలో మేటర్ ఉండాలని ఆమె కౌంటర్ ఇచ్చారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు, సినిమా హీరోల ఫోన్లను టాపింగ్ చేసి బెదిరింపులకు పాల్పడి విధంగా అందరిపై మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు .కేవలం అధికారం కోసం అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై బురద వేయడం పనిగా పెట్టుకున్నారని అన్నారు. మరి ఏ ప్రభుత్వం అమలు చేయాలని సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. పేదవారికి అనేక సంక్షేమ పథకాలు ఎన్నో ప్రవేశ పెట్టి అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నటువంటి ప్రజా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు అని సమావేశంలో కేటీఆర్ అనుచిత వాక్యాలు చేయడం సబబు కాదన్నారు.ప్రజలు గమనించి ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి 16 మంది అభ్యర్థులను గెలిపించి నాకు కానుక ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు.పదవి పోయి మతీ భ్రమించి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.



## బల్దియా ప్రజావాణికి 99 ఫిర్యాదులు

- పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారుల పై ఉంది
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ మహా;** ప్రజావాణి ఫిర్యాదు లకు తక్షణమే పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమం లో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు విభాగాల వారిగా.... టౌన్ ప్లానింగ్..43, ఇంజనీరింగ్.. 25, రెవిన్యూ.... 11, హెల్త్ ,శానిటేషన్..15నీటి సరఫరా..05, మొత్తం 99 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య ,టి ఓ రామకృష్ణ ఎం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతర ఛాయాచిత్ర ప్రదర్శన

**కాకతీయులతో పోరాటం చేసిన వీరవనితలు-కున్సోత్ హనుమంతరావు**

**మహా పరకాల:** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమ వారం రోజున మేడారం జాతర ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కున్సోత్ హనుమంతరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ సమ్మక్క సారమ్మ గద్దెల పునర్నిర్మాణం నుంచి తిరుగు వారం వరకు జరిగిన సమ్మక్క సారలమ్మజాతర విశేషాలను వివిధ పత్రికలలో వచ్చినటువంటి ఛాయాచిత్రాలను సేకరించి ప్రదర్శన రూపంలో ఉంచడం జరిగింది.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కున్సోతు హనుమంతరావు మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మలు కాకతీయులతో పోరాటం చేసిన గొప్ప వీరవనితలని అన్నారు. సమ్మక్క సారలమ్మ చరిత్రను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఈ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవగాహన అవసరం

### సహయోగ్ పోర్టల్ ద్వారా దేశ పౌరుల రక్షణే మా లక్ష్యం..అశోక్ కుమార్ సైబర్ క్రైం సర్కిల్ ఇన్స్పెక్టర్



**హన్మకొండ మహా;** వరంగల్ లో కాకతీయ విశ్వవిద్యాలయం లోని డీన్ స్టూడెంట్ అఫైర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగం వారు సంయుక్తంగా కేయూ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా "సైబర్ సురక్ష మొబైల్ రక్షణ పై అవగాహన శిబిరం కేయూ సెనేట్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేయూ క్యాంపస్ లోని అన్ని కాలేజీల నుండి 254 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ శిబిరంలో జరిగిన రెండు సెషన్ లలో సైబర్ క్రైం పోలీసు శాఖ, టెలికం విభాగాల నుండి అధికారులు విద్యార్తులకు సైబర్ నేరాల మీద అవగాహన కల్పించారని ప్రో మామిడాల ఇస్తారి, డీన్ స్టూడెంట్ అఫైర్స్, డా బీ. రమ, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన సైబర్ క్రైం సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ తో పాటు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ చరణ్ మాట్లాడుతూ, సైబర్ నేరాల నివారణలో ప్రభుత్వ పోర్టల్ ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ సైబర్ క్రైం పోర్టల్ ద్వారా సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, మహిళలు పిల్లల పై జరిగే సైబర్ నేరాలు వంటి వాటిని సులభంగా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయడమే కాకుండా, ఫిర్యాదు స్థితిని తెలుసుకోవడం, అవసరమైన ఆధారాలు అప్‌లోడ్ చేయడం, సంబంధిత అధికారుల ద్వారా త్వరిత చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థ రూపొందించబడిందని తెలిపారు అలాగే సహయోగ్ పోర్టల్ ద్వారా దేశ పౌరుల కోసం సురక్షితమైన సైబర్ వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సైబర్ నేరాల నివారణ, గుర్తింపు, దర్యాప్తు నేరస్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సమర్థవంతమైన ఫ్రేమ్‌వర్క్ ఎకోసిస్టమ్‌ను ఈ పోర్టల్ అందిస్తుందని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయం పెరిగి, సైబర్ నేరాలపై వేగవంతమైన చర్యలు సాధ్యమవుతాయని వారు వివరించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ సంచార్ సాథి, పోర్టల్‌లో అందుబాటులో ఉన్న చక్షు తో పాటు ఇతర సౌకర్యాల గురించి మాట్లాడుతూ, అనుమానాస్పద మోసాలను నివేదించడం, అనవసర వాణిజ్య సందేశాలు కాల్స్ పై ఫిర్యాదు చేయడం, అనుమానాస్పద వెబ్ లింక్‌లను నివేదించడం, కోల్పోయిన లేదా దొంగిలించబడిన మొబైల్ హ్యాండ్‌సెట్ ను బ్లాక్ చేయడం, తన పేరుతో ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవడం, ఉపయోగిస్తున్న మొబైల్ హ్యాండ్‌సెట్ అసలైన దేనా కాదా అన్నది తెలుసుకోవడం, భారతీయ నంబర్‌తో వచ్చే అంతర్జాతీయ కాల్‌స్‌ను నివేదించడం వంటి అనేక ఉపయోగకరమైన సేవలు ఈ పోర్టల్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటే సైబర్ మోసాల నుంచి తక్షణ రక్షణ పొందవచ్చని, ప్రతి పౌరుడు ఈ పోర్టల్‌ల పై అవగాహన కలిగి ఉండటం ద్వారా సురక్షితమైన డిజిటల్ సమాజాన్ని నిర్మించవచ్చని వారు సూచించారు. వరంగల్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 నుంచి 2026 ఫిబ్రవరి 9 వరకు మొత్తం 223 సైబర్ కేసులు నమోదై, రూ.36.91 కోట్ల నష్టం జరిగినట్లు తెలిపారు. ఇందులో 139 కేసుల ద్వారా రూ.2.66 కోట్లను బాధితులకు తిరిగి అందించగలిగామని, 95 మంది నిందితులను గుర్తించి 45 కేసుల్లో చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ గణాంకాలు సైబర్ నేరాల తీవ్రతను స్పష్టం చేస్తున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

- నిన్న సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రచారంపై నిషేధం
- నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- వైన్సులు కల్లు దుకాణాలు బంద్
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న ఆమన్‌గల్, చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం, షాద్నగర్, మొయినాబాద్, శంకర్ పల్లి మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 10వ తేదీన సెలవు ఉంటుందని, పోలింగ్ రోజు అనగ ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో అన్ని ప్రవేటు / ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ / ప్రైవేటు సెక్టార్ సంస్థలు , వాణిజ్య సంస్థలలో పని చేసే ఉద్యోగులకు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## మహిళలకు చీరలు పంపిణీ చేసిన దాతలు

**ఆలయ అధ్యక్షులు తోట సంధ్య బాబన్న**



**వరంగల్ మహా;** వరంగల్ నగరం లోనిమెట్ల బావి శ్రీ ధన మైసమ్మ దేవాలయం, అధ్యక్షులు తోట బాబన్న ఆధ్వర్యంలో దాతలు నలివేల జయ రవీందర్ దంపతులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీ ధన మైసమ్మ అమ్మవారికి సమర్పించిన రూ. 21000 విలువ చేసే 82 చీరలను తూర్పుకోట వాస్తవ్యులు నలివెల జయ రవీందర్ దంపతులు విక్రయించి వాటిని వారి కూతురు కీర్తిశేషులు నలివెల సజా జ్ఞాపకార్థంగా శ్రీ ధన మైసమ్మ ఆలయంలో నిరుపేద వృద్ధ మహిళలకు, నిరుపేద దివ్యాంగ మహిళలకు వితంతు మహిళలకు చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ , కాంగ్రెస్ జిల్లా నాయకులు కరాటే ప్రభాకర్ ఉమా, 35వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పోరేటర్ అభ్యర్థి మెరుగు అశోక్, గడ్డం రవి, ఆలయ గౌరవ అధ్యక్షులు కందకట్ల భాస్కర్ , దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ , ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి జిల్లా కార్యదర్శి బత్తిని రాజు కార్యదర్శి ఎండి సాదిక్ 34వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు లావణ్య, తూర్పుకోట నాయకులు హర్సమ్ రాంబాబు, బడ్డదా వీరన్న బోయిని దూడయ్య ,ఎసిరెడ్డి రమేష్ , ఏసీరెడ్డి ప్రభాకర్ 33 వ డివిజన్ నాయకులు మెంగని నరేశ్ రవీందర్ , అప్పని కృష్ణ పాషాబోయిన విజయ్ హాజరైయ్యారు. వీరికి ఆలయ అధ్యక్షులు తోట బాబన్న అమ్మవారి ఫోటోలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు అనంతరం తోట బాబన్న మాట్లాడుతూ అమ్మవారి చీరలను తీసుకుని వాటిని పేదలకు పంపిణీ చేసిన నలివేల రవీందర్ జయ దంపతులకు శ్రీ ధన మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని అదేవిధంగా ఆ చీరలు తీసుకున్న భక్తులకు కూడా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆ అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు సత్యనారాయణ , కోశాధికారి యాద రవి , అర్చకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ మహా;** ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ ప్రజల నుండి 118 అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

## పరకాలను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం

- రేవూరి ప్రకాష్ రెడ్డి ఏమి అభివృద్ధి చేశావని ఓట్లు అడగడానికి వెళుతున్నావు..?
- రేవూరి ప్రకాష్ రెడ్డి చిన్న పిల్లోడివా.. ముసలోడివా..
- పరకాలను అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రసంగం



**మహా పరకాల:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఓట్లు అడగడానికి పరకాలలో ఏం అభివృద్ధి చేశావని ప్రజల వద్దకు వెళ్తున్నావని బిఆర్ఎస్ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార రోడ్ షో కార్యక్రమాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైనారు. గతంలో ఎమ్మెల్యేగా నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఆదపాతాలలోనికి తొక్కేశావ్, నర్సంపేట నియోజకవర్గంలో ఎన్ని తండాలు ఉన్నాయో నీకు తెలియదు, ఏం అభివృద్ధి చేశావో అక్కడి ప్రజలు చెబుతారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇప్పుడు పరకాల అభివృద్ధి చేస్తానని, ఎంతో చరిత్ర గల పరకాలను నిర్వీర్యం చేయడానికి పూనుకున్నావని విమర్శించారు పరకాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయం, కూరగాయల మార్కెట్, వంద పడకల ఆసుపత్రి, ఆయుష్ ఆసుపత్రి, పాలిటెక్నిక్ కళాశాల, బస్తీ దావకానల నూతన భవన నిర్మాణాలకు మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నిధులు తీసుకొచ్చి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలోని సెంట్రల్ లైటింగ్, అంబేద్కర్ సెంటర్ ప్రధాన రోడ్డు కల్వర్టు, హౌసింగ్ బోర్డు నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు నూతన బైపాస్ రోడ్డు, పట్టణంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో జరిగినవే అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ నూతన భవనాలకు రంగులు వేసి, శిలాఫలకాలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని పులిని చూసి నక్కలు వాత పెట్టుకున్న చందంగా రేవూరి ప్రకాష్ రెడ్డి తీరు సిగ్గుచేటని విమర్శించారు. అమాయకులైన తెలంగాణ ప్రజలను ఆరు గ్యారెంటీల పేరుతో రేవంత్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి మోసం చేసి గద్దెనెక్కారని, అదే తెలంగాణ ప్రజలు మేల్కొని ఈ మున్సిపల్ ఎన్నికలతో పాటు రానున్న అసెంబ్లీ ఎన్నికలలో మీ భరతం పట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డుల్లోని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మ్యూచువల్ ఫండ్ కొత్త స్కీములు

**ముంబై:** కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. కోటక్ సర్వీసెస్ ఫండ్ పేరుతో కొత్త పథకాన్ని (ఎన్‌ఎఫ్‌వో) ప్రారంభించింది. ఈ నెల 18 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. దేశ జీడీపీలో 55 శాతం వాటా ఆక్రమిస్తూ, వృద్ధికి కీలక చోదకంగా ఉన్న సేవల రంగంలో పెట్టుబడులకు ఈ పథకం వీలు కల్పిస్తుందని కోటక్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. వినియోగ సేవలు, టెలికం, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, ఐటీ, విద్యుత్, ఆయిల్ అండ్ గ్యాస్ తదితర రంగాలతో కూడిన సేవలు దీర్ఘకాల పెట్టుబడులకు మంచి వృద్ధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొంది. మంచి వృద్ధి అవకాశాలు, సహేతుక ధరల వద్దనున్న కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. వ్యాపారం, యాజమాన్యం, కంపెనీ విలువకు ప్రాధాన్యం ఇస్తుంది. అన్ని రకాల మార్కెట్ విలువల్లోనూ పెట్టుబడులు పెడుతుంది. నాణ్యమైన వ్యాపారం, బలమైన నగదు ప్రవాహాలను చూస్తుంది. కనీసం రూ.1,000, అంతకుమించి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎన్‌ఎఫ్‌వో ముగిసిన కొన్ని రోజుల అనంతరం తిరిగి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో, దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని కోరుకునే వారికి ఈ పథకం అనుకూలమని కోటక్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది.




### 360 వన్ ఎంఎఫ్ నుంచి సిఫ్ పథకం

సంపన్న ఇన్వెస్టర్ల కోసం 360 వన్ మ్యుచువల్ ఫండ్ తాజాగా డైనాసిఫ్ ఈక్విటీ లాంగ్-షార్ట్ ఫండ్ పేరిట స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సిఫ్)ని ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 20న ముగుస్తుంది. ఇది కనీసం 80 శాతం నిధులను ఈక్విటీలు, ఈక్విటీ డెరివేటివ్స్‌కి కేటాయిస్తుంది. ఈక్విటీ డెరివేటివ్స్ ద్వారా 25 శాతం వరకు షార్ట్ ఎక్స్‌పోజర్ తీసుకునేందుకు, డెట్ అలాగే ఇన్విట్స్‌లో 20 శాతం వరకు ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఉంటుంది. దీనికి బీఎస్ఈ 500 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. కనీసం రూ. 10 లక్షలు (అక్రెడిటెడ్ ఇన్వెస్టర్లయితే రూ. 1,00,000) ఇన్వెస్ట్ చేయొచ్చు. మ్యుచువల్ ఫండ్స్ పరమైన ట్యాక్సేషన్ ప్రయోజనాలతో పాటు మరింత మెరుగైన రాబడులను అందించే విధంగా ఈ ఫండ్ ఉంటుందని 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఈవో రాఘవ్ అయ్యంగార్ తెలిపారు.


### డీఎస్‌పీ మల్టీ అసెట్ ఆమ్ని ఎఫ్‌వోఎఫ్

ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియను సరళతరం చేసే దిశగా డీఎస్‌పీ మ్యుచువల్ ఫండ్ సంస్థ మల్టీ అసెట్ ఆమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్)ని ప్రవేశపెట్టింది. ఇది ఫిబ్రవరి 19 వరకు అందుబాటులో ఉంటుంది. సంస్థకు చెందిన స్వంత మార్కెట్ ఇంటెలిజెన్స్ ఫ్రేమ్‌వర్క్ డీఎస్‌పీ నేత్ర దన్నుతో ఇది పని చేస్తుంది. ఈక్విటీ, డెట్ ఆధారిత స్కీములు, గోల్డ్..సిల్వర్ ఈటీఎఫ్‌ల్లాంటి కమోడిటీ ఆధారిత స్కీములు మొదలైన వాటిలో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి ఈక్విటీ ఆధారిత స్కీముల్లో 25-75 శాతం, డెట్ స్కీముల్లో 15-50 శాతం, గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లలో 10-50 శాతం మేర ఇది పెట్టుబడులు పెట్టొచ్చు. మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు ఈక్విటీల్లో పెట్టుబడులను కనిష్టంగా 25 శాతానికి కూడా తగ్గించే వెసులుబాటు ఉంటుంది. పెట్టుబడులను వివిధ సాధనాల్లో డైవర్సిఫై చేయడం వల్ల రాబడుల కోసం కేవలం ఒకే సాధనంపై ఆధారపడాల్సిన రిస్క్‌లు తగ్గుతాయని సంస్థ ప్రోడక్ట్ హెడ్ సాహిల్ కపూర్ తెలిపారు.

# ఏఐ సమ్మిట్ 2026

## హోటల్‌లో ఒక్క రాత్రికి రూ.30 లక్షలు!

భారతదేశంలో కృత్రిమ మేధ (AI) రంగానికి పెరుగుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యతను ప్రతిబింబిస్తూ.. ఇండియా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' న్యూఢిల్లీలో ఫిబ్రవరి 16 నుంచి జరగనుంది. నాలుగు రోజుల పాటు సాగే ఈ సదస్సు ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన నాలుగు ఏఐ సమ్మిట్లలో అతి పెద్దదిగా నిలవనుంది. ఈ సమ్మిట్‌కు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్పందన లభించింది. ఇప్పటి వరకు ఈ కార్యక్రమానికి 35,000 మందికి పైగా రిజిస్టర్ చేసుకోగా.. ప్రభుత్వాలు, దేశీయ & అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థలు, యూనివర్సిటీలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. సుమారు 100 కంటే ఎక్కువ దేశాల నుంచి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని అంచనా. అంతే కాకుండా 15 నుంచి 20 మంది దేశాధినేతలు, 50 మందికి పైగా మంత్రులు, అలాగే ప్రముఖ భారతీయ మరియు అంతర్జాతీయ కంపెనీలకు చెందిన 40 మందికి పైగా సీఈఓలు ఈ సదస్సులో పాల్గొనే అవకాశం ఉంది. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కావడానికి ముందే.. దేశ రాజధానిలో హోటళ్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు నగరంలోని లగ్జరీ హోటళ్ల గదుల ధరలు భారీగా పెరిగాయి. ఫిబ్రవరి 16న ఢిల్లీలోని ఇంపీరియల్ హోటల్‌లో ఒక రాత్రి



గది ఛార్జీ.. ఒక వ్యక్తి రూ. 1,97,049 ఖర్చవుతుంది. దీనికి అదనంగా రూ. 35,469 పన్ను చెల్లించాలి. తాజ్ ప్యాలెస్‌లో, ప్రెసిడెన్షియల్ సూట్ ఒక రాత్రికి రూ. 30 లక్షలు అని సమాచారం. సాధారణ రోజుల్లో దీని ధర సుమారు రూ. 2,37,500. హయత్ రీజెన్సీ ఒక రాత్రికి దాదాపు రూ.50,000 వసూలు చేస్తుండగా, లీలా ప్యాలెస్ పన్నులతో సహా రాత్రికి రూ. 78,000 వసూలు చేస్తోంది. ది ఓబెరాయ్ హోటల్‌లో అయితే కొన్ని గదుల ధరలు రూ.5 లక్షల వరకు ఉండటంతో పాటు, కనీసం రెండు రాత్రులకు బుక్ చేసుకోవాలనే రూల్ కూడా ఉంది.

# పీఎఫ్ విత్‌డ్రా మరింత సులభం!

ఈపీఎఫ్ఓ చందాదారులు.. తమ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (EPF)ను ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకోవడానికి ఉపయోగపడే ఫీచర్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు.. కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయా గతంలోనే వెల్లడించారు. ఇప్పుడు దీనికి సంబంధించిన కొత్త మొబైల్ అప్లికేషన్‌ను 2026 ఏప్రిల్ నాటికి ప్రారంభించనున్నారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రారంభించనున్న మొబైల్ అప్లికేషన్ ద్వారానే.. 8 కోట్ల మంది సభ్యులు తమ ప్రావిడెంట్ ఫండ్ (EPF)ను యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) ద్వారా నేరుగా విత్‌డ్రా చేసుకోవచ్చు. EPFO 3.0 అప్‌గ్రేడ్‌లో భాగంగా తీసుకొస్తున్న ఈ కొత్త విధానం వినియోగదారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.ప్రస్తుతం పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవాలనుంటే.. అప్లై చేసుకోవాల్సి





ఉంటుంది. దీనికి కొంత సమయం పడుతుంది. దీనిని మరింత సులభతరం చేయడానికి యూపీఐ విత్‌డ్రా తీసుకురావడం జరుగుతోంది. కాగా ఇప్పటికే ఆటో సెటిల్‌మెంట్ మోడ్ లిమిట్ రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచారు.ఈపీఎఫ్ఓ సభ్యులు తమ బ్యాంక్ ఖాతాలకు యూపీఐ పిన్ ఉపయోగించి ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత కలిగి ఉన్నారో ఆ మొత్తాన్ని వెంటనే విత్‌డ్రా చేసుకోవచ్చు.ఒకసారికి కేవలం రూ. 25వేలు విత్‌డ్రా చేసుకోవచ్చు.యాప్‌లో మీరు ఎంత మొత్తంలో విత్‌డ్రా చేసుకోవచ్చు అనేది కనిపిస్తుంది.ప్రస్తుతం ఈ విధానం ఎలా పనిచేస్తుంది అని తెలుసుకోవడానికి ట్రయల్ రన్స్ చేస్తున్నారు. తద్వారా ఏదైనా సాంకేతిక సమస్యలు ముందే గుర్తించి పరిష్కరించవచ్చు. కొత్త యాప్ ప్రధాన మొబైల్ ఇంటర్ఫేస్‌గా యూపీఐ విత్‌డ్రా కోసం ఉపయోగిస్తారు. అయితే అధికారిక వెబ్‌సైట్, ఉమాంగ్ యాప్ కూడా ఇతర సేవల కోసం ఉపయోగించుకోవచ్చు.

# 33 ఏళ్ల క్రితం సాధారణ వెబ్ అడ్రస్‌గా రిజిస్టర్.. ఇప్పుడు రూ. 600 కోట్లు!

పేరులో నేముంది అని అనుకుంటే పొరపాటు. ఒక చిన్న పదం. కేవలం రెండే రెండక్షరాలు. కానీ దాని విలువ భారత కరెన్సీలో అక్షరాల 600 కోట్లు. ఆ రెండక్షరాల పదం ఏంటి? దానిని రూ.600కోట్లకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏంటి? దాని కథా కమా మిషు ఏంటో తెలుసుకుందాం పదండి. ఇంటర్నెట్‌లో డొమైన్ అడ్రస్ చాలా విలువైంది. వెబ్‌సైట్ డొమైన ట్రెండింగ్‌లో ఉన్నా డిమాండ్ ఉండే బిజినెస్‌కు చెందినదైనా దాని ధర కోట్లు పలుకుతుంది. ఎంత ధరపెట్టైనా సరే దాన్ని కొనుగోలు చేస్తారు. అలాంటి వెబ్‌సైట్ డొమైన్ కళ్లు చెదిరే ధరకు అమ్ముడుపోయింది. క్రిప్టో.కామ్ వ్యవస్థాపకుడు క్రిస్ మార్జాలెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డొమైన్ ఏఐ డాట్ కామ్‌ను 70మిలియన్ డాలర్లు వెచ్చించి మరీ కొనుగోలు చేశారు. అంటే భారత కరెన్సీలో అక్షరాల రూ.600కోట్లు. ఇదే అత్యధికర ధర పలికిన డొమైన్‌లలో తొలి స్థానంలో నిలిచింది. ఏఐ ఇండస్ట్రీలో ప్రవేశించాలనుకున్నా క్రిప్టో.కామ్ సీఈవో క్రిస్ మార్జాలెక్ సూపర్ బౌల్ సమయంలో ఏఐ.కామ్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నారు. ఈ వెబ్‌సైట్‌లో ఏఐ పర్సనల్ అసిస్టెంట్ లాంచ్ కానుంది. ఈ ఏఐ అసిస్టెంట్ పర్సనల్ మెసేజ్‌లు పంపడంతో పాటు క్రిప్టో ట్రేడింగ్,యాప్స్ మేనేజ్ చేయడంతో పాటు ఇతర కార్యకలాపాల్ని చక్కబెడుతోంది. చాట్‌జీపీటీ రాకతో టెక్నాలజీ కొంతపుంతలు తొక్కుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ఎప్పటి నుంచో ఉన్నా.. చాట్‌జీపీటీ రాకతో సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఏఐ వినియోగం రోజురోజుకి పెరిగిపోతుంది. ప్రతిరంగంలో ఏఐ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఈ తరుణంలో ఏఐ.కామ్ డొమైన్‌ను అంత భారీ మొత్తంలో వెచ్చించారు. భవిష్యత్ మొత్తం ఏఐదేనని,అన్నీ రంగాల్లో ఏఐ పెత్తనం చెలాయిస్తుందంటున్నారు. ఇది స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ అయినప్పటికీ రానున్న 20ఏళ్లలో పెట్టుబడులు అమాంతం పెరుగుతాయని క్రిస్ చెబుతున్నారు. ఏఐతో ప్రీమియం డొమైన్లు బ్రాండింగ్‌ను పెంచుతాయని అంటున్నారు. 2016లో క్రిస్.. క్రిప్టో.కామ్‌ను ప్రారంభించారు. అప్పటికే మార్కెట్‌లో క్రిప్టో ప్లాట్‌ఫారమ్స్ ఉన్నాయి. అయినప్పటికీ కంపెనీ వేగంగా వృద్ధి సాధించింది. ప్రస్తుతం, ఏడాదికి 1.5బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. మార్కెటింగ్ బ్రాండింగ్‌పై భారీ ఇన్వెస్ట్ చేసింది.2021లో స్టేడియం బ్రాండింగ్‌పై సుమారు 700 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ట్రంప్ మీడియాతో బిజినెస్ డీల్స్ కూడా చేసింది. ఇవన్నీ గ్లోబల్ బ్రాండింగ్ రికగ్నైజేషన్‌ను పెంచాయి. ఇప్పుడు ఏఐ.కామ్ కొనుగోలుతో సరికొత్త రికార్డులు సృష్టించారు క్రిస్ మార్స్‌జాలెక్. ఇక క్రిస్ మార్స్‌జాలెక్ ఏఐ.కామ్ డొమైన్‌ను మలేషియన్ టెక్ ఎంట్రప్రెన్యూర్ అర్స్యాన్ ఇస్మాయిల్ నుంచి కొనుగోలు చేశారు. ఈ డొమైన్‌ను ఇస్మాయిల్ 1993లో 100 డాలర్లు చెల్లించి రిజిస్టర్ చేసుకున్నారు. ఆ సమయంలో ఇది సాధారణ వెబ్ అడ్రస్ మాత్రమే. కానీ కాలక్రమేణా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రాధాన్యం పెరిగిన కొద్దీ, ఈ డొమైన్ విలువ ఆకాశాన్ని తాకింది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# డాలస్‌లో కాదు.. పాక్‌లో ఉన్నట్లుంది!.. అమెరికా నేత ఆవేదన

**న్యూయార్క్:** అమెరికాలో ముస్లిం వలసల పెరుగుదలపై రిపబ్లికన్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యుడు బ్రాండెన్ గిల్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్సాస్ రాష్ట్రంలో పలు ప్రాంతాలు భారీగా 'ఇస్లామీకరణ'కు గురవుతున్నాయన్నారు. డాలస్ నగరంలో ఇస్లామీకరణ స్థానికులను ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. ''డాలస్‌లోని కొన్ని మాల్స్‌ను సందర్శించండి.. మీరు డాలస్‌లో కాదు, పాకిస్తాన్‌లో ఉన్నట్లు అనిపిస్తుంది'' అని శుక్రవారం రియల్ అమెరికాస్ వాయిస్ ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో కూడా పోస్టు చేశారు. ''తరాలుగా ముస్లింల యాజమాన్యంలో ఉన్న భూముల దగ్గర మసీదులు పుట్టుకొస్తున్నాయి. అవి అసలైన అమెరికాను చంపుతున్నాయి. స్థానిక సంస్కృతిని మార్చేస్తున్నాయి'' అన్నారు. ముస్లిం ప్రముఖులతోపాటు పలువురు జర్నలిస్టులు, హక్కుల సంఘాల నేతలు గిల్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఆయన విద్వేషాలను రెచ్చగొడుతూ ముస్లిం సమాజంపై అపోహలు పెంచుతున్నారని మండిపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో అతి పిన్నవయస్కుడైన గిల్ గతంలోనూ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీపై, భారతీయుల వలసపై నోరుపారేసుకున్నారు.



# ట్రంప్‌నకు భారీ విజయం

## వలసదారులకు ఎదురుదెబ్బ!

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అప్పీల్స్ కోర్టు భారీ ఊరట దక్కింది. వలసదారులను నిర్బంధించే విషయంలో ట్రంప్ ప్రభుత్వ విధానాన్ని అప్పీల్స్ కోర్టు సమర్థించింది. దీంతో, కోర్టులో భారీ విజయం దక్కింది. ఈ మేరకు ధర్మాసనం తరపున 21 మెజారిటీతో జడ్జి ఎడిత్ హెచ్ జోన్స్ తీర్పు రాశారు. కాగా, అమెరికాలో ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వలసదారులను అరెస్టు చేసినప్పుడు హోంలాండ్ భద్రతాధికారులు బాండ్ హియరింగ్‌ను నిరాకరిస్తున్నారు. బాండ్ హియరింగ్‌కు అనుమతి ఇవ్వకుండానే వలసదారులను నిర్బంధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వలసదారుల నిర్బంధాలపై పలువురు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన ఐదో సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు.. ట్రంప్ ప్రభుత్వ విధానాన్ని సమర్థించింది. ధర్మాసనం తరపున 21 మెజారిటీతో జడ్జి ఎడిత్ హెచ్ జోన్స్ తీర్పు రాశారు. ఈ సందర్భంగా.. బాండ్ హియరింగ్ నిర్బంధాలకు అనేక కోర్టులు వ్యతిరేకంగా తీర్పులిస్తున్నాయి. కానీ ఇది రాజ్యాంగం, ఫెడరల్ వలస చట్టాలకు అనుగుణంగానే ఉంది. వలస, జాతీయ చట్టాలకు ప్రభుత్వం సరిగానే అర్థం చెప్పిందని అభిప్రాయపడ్డారు. అనుమతిలేని విదేశీయులు దేశంలో ఎక్కడ పట్టుబడినా బాండ్‌పై విడుదలకు అనర్హులని స్పష్టం చేశారు. వారు ఎంతకాలం దేశంలో ఉన్నారన్నదీ అప్రస్తుతమని పేర్కొన్నారు. అయితే, గతంలో విదేశీయులు సరిహద్దుల్లో అరెస్టయితే.. వారికి ఎటువంటి నేర చరిత్రా లేకపోతే వలసదారుల కోర్టులో బాండ్ హియరింగ్‌ను కోరేవారు. కోర్టులూ వారికి బాండ్లను మంజూరు చేసేవి. కానీ, డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక వలసదారులపై ఉక్కుపాదం మోపారు. అక్రమ వలసదారులను అమెరికా నుంచి పంపించేశారు. ఈ నేపథ్యంలో మెక్సికోకు చెందిన ఇద్దరు వలసదారులు అమెరికాలో పదేళ్లుగా ఉంటున్నారు. గత ఏడాది వారు తమను నెలలపాటు నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్లు వేశారు. వారికి గత అక్టోబరులో టెక్సాస్ కోర్టు బాండ్లు మంజూరు చేసింది. గత జులైలో ట్రంప్ యంత్రాంగం బాండ్ల విధానాన్ని తిరగదోడింది. తాజాగా అప్పీల్స్ కోర్టు ఆ విధానాన్ని సమర్థించింది. కాగా, ఇలాంటి నిర్బంధాలను ఇటీవల దిగువ కోర్టులు తప్పుబడుతున్న నేపథ్యంలో ఈ తీర్పు ట్రంప్‌నకు భారీ న్యాయ విజయంగా చెప్పవచ్చు.



# ట్రంప్ భయం.. 37 ఏళ్ల రికార్డు బ్రేక్

ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ తన నివాస రహస్యం ఎవరికీ తెలియకుండా చాలా రహస్యంగా తలదాచుకుంటున్నారు. అమెరికా శాటిలైట్స్ సైతం కనిపెట్టకుండా ప్రత్యేకమైన బంకర్లలో ఆయన తలదాచుకుంటున్నట్లు సమాచారం .ఈ నేపథ్యంలో ఖమేనీ 37 ఏళ్లుగా ఉన్న ఓ రికార్డును బ్రేక్ చేశారు. 1989లో షియా మత గురువు ఆదేశ సుప్రీం లీడర్ రుహోల్లా ఖోమేని మరణాంతరం ఆయతుల్లా అలీ ఖమేనీ బాధ్యతలు స్వీకరించారు. ఆ రోజు నుంచి నేటి వరకూ దాదాపుగా 37 ఏళ్లుగా ఇరాన్ సుప్రీంగా ఖమేనీ కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దశాబ్దాలుగా ఉన్న ఓ సంప్రదాయాన్ని అమెరికా ఉద్రికత్తల నేపథ్యంలో వదులుకోవాల్సి వచ్చింది. 1979 ఫిబ్రవరి 8వ తేదీ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది, ఆ రోజున ఒక బృందం వైమానిక దళ అధికారులు పహ్లావీ రాజవంశాన్ని కూలదోసినందుకు గాను రుహోల్లా ఖొమేనీకి విధేయత ప్రకటించారు. అనంతరం అప్పటి నుంచి ఆ రోజున ఆ దేశ వైమానిక అధికారులతో ఇరాన్ సుప్రీం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. కరోనాతో ప్రపంచం మంతా ఆంక్షలు ఉన్న సమయంలోనూ ఈ సమావేశం నిర్వహించారు. అయితే ప్రస్తుతం అమెరికాతో హాని పొంచి ఉన్న నేపథ్యంలో తొలిసారిగా ఆ దేశ సుప్రీం ఆ భేటీకి హాజరు కానట్లు ఇరాన్ అధికారులు ప్రకటించారు. ఈ సారి ఆయనకు బదులుగా ఆ సమావేశానికి ఆర్మీ ఫోర్స్ చీఫ్ అబ్దుల్ రహీం మౌస్వీ హాజరైనట్లు అధికారులు తెలిపారు. దీంతో 37 ఏళ్లుగా ఇరాన్ సుప్రీం పాటిస్తున్న సంప్రదాయానికి తొలిసారిగా బ్రేక్ పడినట్లయింది. అయితే అమెరికాతో ముంపు పొంచి ఉన్న నేపథ్యంలోనే ఖమేనీ బయిటకి రాలేదని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రెండు దేశాలు వెనక్కితగ్గేలా కనిపించడం లేదు. అణు కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న యురేనియం శుద్ధి ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో నిలిపేది లేదని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. తమ దేశ సార్వభౌమాధికారం విషయంలో ఎట్టిపరిస్థితుల్లో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. అటు అమెరికా తన యుద్ధ నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను అరేబియా సముద్రంలో మోహరించింది. కొద్దిరోజుల క్రితం ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేసిన యుఎస్ ఇప్పుడు ఆ దేశంపైకి ఏ క్షణానైనా దాడి చేసేలా మరింత దగ్గరగా అబ్రహం లింకన్‌ను తీసుకవచ్చింది. దీంతో పశ్చిమాసియాలో ఏం జరగనుందా? అని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.




# జంక్ ఫుడ్స్ నిషేధం

## మొబైల్ వాడకంపైనా కఠిన నిబంధనలు

విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో భాగంగా యూఏఈ విద్యామంత్రిత్వ శాఖ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. స్కూల్ క్యాంటీన్లలో జంక్ ఫుడ్, డ్రింక్స్ అమ్మడంపై నిషేధం విధించింది. ఈ జాబితాలో సాఫ్ట్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, కృత్రిమ జ్యూసులు, చాక్లెట్, కేక్, డోనట్, స్వీట్ బిస్కెట్లు,చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, నూడుల్స్, సాసేజులు, బర్గర్స్ ఉన్నాయి. అలర్జీ సమస్యల కారణంగా వేరుశనగ, కాజూనట్స్‌ని కూడా నిషేధించారు. పండ్లు, కూరగాయలు, హోల్ గ్రెయిన్స్ మెండుగా ఉండే ఇంట్లో తయారు చేసిన ఆహారం పిల్లలకు ఇవ్వమని ప్రభుత్వం సూచించింది. అలానే పిల్లల్లో మొబైల్ ఫోన్ వినియోగంపై కూడా కఠిన నియమాలు అమలు చేశారు. తొలిసారి పాఠశాలకు ఎవరైనా ఫోన్ తీసుకునివస్తే నెల రోజులపాటు దాన్ని తిరిగి ఇవ్వరు. మళ్లీ మళ్లీ ఇలానే చేస్తే.. విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు ఆ ఫోన్ తిరిగి ఇవ్వడం కుదరదని యూఏఈ ప్రభుత్వం పేర్కొంది. ఈ నియమాలు అమలు చేయడంలో భాగంగా అధికారులు.. విద్యార్థుల బ్యాగ్స్ తనిఖీ చేయొచ్చు. అయితే తనిఖీలు చేసినప్పుడు పిల్లల బ్యాగ్‌లో మొబైల్ దొరికితే.. వెంటనే తల్లిదండ్రులు సంతకంతో రికార్డ్ చేయాలి. ఐప్యాడ్ లేదా ట్యాబ్ అనేవి చదువుకోసం మాత్రమే. టీచర్స్ అనుమతితోనే వీటిని ఉపయోగించాల్సి ఉంటుంది. విరామం లేదా క్లాస్ తర్వాత వీటిని ఉపయోగించడం.. నిబంధనలకు విరుద్ధం. ఈ చర్యలన్నీ విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడతాయని సంబంధిత మంత్రిత్వ శాఖ భావిస్తోంది.

# పుతిన్‌తో భేటీకి ఎప్‌స్టీన్ తహతహ?

**న్యూఢిల్లీ:** అమెరికా గూఢచారిగా ముద్రపడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కు సంబంధించి తాజాగా వెల్లడైన మరో విషయం చర్చనీయాంశంగా మారింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సహా పలువురు ఉన్నత స్థాయి రష్యా అధికారులతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఎప్‌స్టీన్ ప్రయత్నించినట్లు అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన తాజా పత్రాలు వెల్లడిస్తున్నాయి. సీఎన్ఎన్ కథనం ప్రకారం ఎప్‌స్టీన్ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి రష్యా రాయబారి విటాలీ చుర్కిన్‌తో తరచూ సమావేశమయ్యేవారు. చుర్కిన్ కుమారుడు మాగ్జిమ్‌కు న్యూయార్క్‌లోని ఒక వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలో ఉద్యోగం ఇప్పించేందుకు కూడా ఎప్‌స్టీన్ ప్రతిపాదించినట్లు ఈ పత్రాల్లో వెల్లడయ్యింది. 2017లో రాయబారి విటాలీ చుర్కిన్ ఆకస్మిక మరణం తర్వాత, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సంబంధాలు పెంచుకోవడానికి ఎప్‌స్టీన్ ప్రయత్నించారు. 2018 జూన్ 24న నోర్వే రాజకీయ నేత థోర్‌బ్‌జోర్న్ జగ్‌ల్యాండ్‌కు పంపిన ఈమెయిల్‌లో, 'నాతో మాట్లాడటం ద్వారా పలు కీలక విషయాలు తెలుసుకోవచ్చని మీరు పుతిన్‌కు సూచించవచ్చు' అని ఎప్‌స్టీన్ పేర్కొన్నారు. రష్యాలో పాశ్చాత్య దేశాల పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రణాళికలను వివరించే నెపంతో పుతిన్‌ను కలవాలని ఎప్‌స్టీన్ భావించారు. 2013లో మాజీ ఇజ్రాయెల్ ప్రధాని ఎహుద్ బరాక్‌కు రాసిన ఈమెయిల్‌లో నార్వే నేత ఒకరు జగ్‌ల్యాండ్ సోచిలో పుతిన్‌ను కలవబోతున్నారని, ఆ సమయంలో తన గురించి ప్రస్తావించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. తాను బిల్ గేట్స్ లాంటి ప్రముఖులకు సలహాదారునని, పుతిన్‌తో కనీసం రెండు మూడు గంటల పాటు ఏకాంతంగా చర్చలు జరపాలని కోరుకుంటున్నట్లు ఎప్‌స్టీన్ విన్నవించారు. అయితే సెయింట్ పీటర్స్‌బర్గ్ ఆర్థిక సదస్సులో పుతిన్ కోరిన భేటీని తానే తిరస్కరించానని ఎప్‌స్టీన్ చెప్పుకున్నప్పటికీ, దానికి సరైన ఆధారాలు లేవు. ఎప్‌స్టీన్ వ్యవహారంపై పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ స్పందించారు. ఈ లైంగిక వేధింపుల కుంభకోణాన్ని రష్యా నిఘా సంస్థలే వ్యవస్థీకృతం చేసి ఉండవచ్చనే అనుమానంతో తమ దేశం దర్యాప్తు చేపడుతుందని ప్రకటించారు. ప్రపంచ దేశాల నేతలను బ్లాక్ మెయిల్ చేసేందుకు రష్యా వద్ద కీలక సమాచారం ఉండే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలను రష్యా కొట్టిపారేసింది. ఎప్‌స్టీన్ రష్యా గూఢచారి అనే దానిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని, అటువంటి నిరాధారమైన విషయాలపై సమయం వృథా చేయవద్దని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు.





# 2027 పండగే టార్గెట్?


ఈసారి సంక్రాంతికి ఐదు తెలుగు సినిమాలు వస్తే అందులో మూడు హిట్ అయ్యాయి. ముఖ్యంగా చిరంజీవి 'మన శంకరవరప్రసాద్'.. ఎవరూ ఊహించని స్థాయిలో సక్సెస్ అయింది. రూ.300 కోట్లకు పైగా కలెక్షన్ వచ్చాయని నిర్మాతలు ప్రకటించుకున్నారు. తెలుగులో మాత్రమే తీసిన ఓ మూవీకి ఈ రేంజ్ వసూళ్లు రావడం చూసి అంతా ఆశ్చర్యపోయారు. దీంతో వచ్చే పండగకి ఇప్పటినుంచే కర్చీఫులు వేసేస్తున్నారు. తెలుగు సీనియర్ హీరోలు నలుగురు రాబోతున్నట్లు హింట్స్ ఇచ్చేస్తున్నారు. అధికారికంగా చూసుకుంటే నాగార్జున.. సినిమాతో పాటు డేట్ కూడా ప్రకటించేశారు. 'సోగ్గాడే చిన్ని నాయన' సినిమాకు మూడో పార్ట్ వచ్చే సంక్రాంతికి అంటే జనవరి 15న థియేటర్లలోకి రాబోతుందని అఫీషియల్ ప్రకటన ఇచ్చారు. కల్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించిన తొలి భాగం 2016లో రాగా అద్భుతమైన హిట్ అయింది. 2022లో వచ్చిన రెండో పార్ట్ కూడా సక్సెస్ అందుకుంది. 2027 సంక్రాంతికి ఇప్పుడు మూడో భాగం రానుంది. ఈసారి చిరంజీవితో బ్లాక్‌బస్టర్ కొట్టిన దర్శకుడు అనిల్ రావిపూడి.. వచ్చే సంక్రాంతికి మరో సినిమాతో వస్తానని ఇదివరకే చెప్పేశాడు. అయితే అది వెంకటేశ్‌తోనే ఉండబోతోందని టాక్. ఇందులో మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ కూడా నటిస్తాడని మాట్లాడుకుంటున్నారు. వెంకీఫహాద్ తో డ్యుల్లుగా కనిపించబోతున్నారని టాక్. ఒకవేళ ఇది నిజమైతే మాత్రం అనిల్‌వెంకకి మరో హిట్ పక్కా. ఈసారి పండగకు వచ్చి హిట్ కొట్టిన చిరంజీవి.. వచ్చే సంక్రాంతికి కూడా రావాలని అనుకుంటున్నారట. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ దర్శకత్వంలో మరోసారి చిరు పనిచేయబోతున్నారు. ఇదివరకే ప్రకటన వచ్చింది. కూతురి సెంటిమెంట్ నేపథ్యంగా సాగే యాక్షన్ స్టోరీ ఇదని తెలుస్తోంది. దీన్ని పండగకే టార్గెట్ చేసుకుని తెరకెక్కించే ఆలోచనలో ఉన్నారట. మరోవైపు బాలకృష్ణ.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. తొలుత పీరియాడికల్ స్టోరీ అనుకున్నారు. కానీ బడ్జెట్ సమస్యల వల్ల దాన్ని పక్కనబెట్టేసి ఓ యాక్షన్ మూవీ తీయాలని అనుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుని కూడా వచ్చే సంక్రాంతి బరిలో దింపాలని అనుకుంటున్నారట. ముంబై బ్యాక్‌డ్రాప్ స్టోరీ అని తెలుస్తోంది.గతంలో చిరుబాలకృష్ణ, వెంకీనాగ్, నాగ్‌చిరు.. సంక్రాంతికి పోటీపడిన సందర్భాలు ఉన్నాయి గానీ నలుగురు ఒకేసారి రాలేదు. కానీ వచ్చే సంక్రాంతి మాత్రం ఈ షాకింగ్ పోటీకి వేదిక కానుందని అంటున్నారు.వీళ్లతో పాటు పవన్ కల్యాణ్‌సురేందర్ రెడ్డి, శర్వానంద్‌శ్రీనువైట్ల, తేజ సజ్జా 'జాంబీ రెడ్డి 2' సినిమాలని కూడా ఈ పండగకే థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారట. మరి వీళ్ళలో ఫైనల్ అయ్యేది ఎవరో చూడాలి?



## అజిత్‌ను కలిసేందుకు క్యూ కడుతున్న సెలబ్రిటీలు

హీరో అజిత్.. వివాదాలకు చోటు ఇవ్వని అరుదైన నటుడు. అందుకే ఆయనంటే తోటి నటీనటులందరికీ ఇష్టం. ఇకపోతే అభిమానం పేరుతో వెర్రితలలు వేయకుండా కుటుంబం కోసం శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిమానులకు పదేపదే హితవు చెబుతుంటారు. కాగా ఈయన ఇటీవల నటనతో పాటూ కార్ రేస్ పోటీలపైనా అధికమక్కువ చూపుతున్న విషయం తెలిసిందే. అజిత్ అంతర్జాతీయ కార్ రేస్ పోటీల్లో పాల్గొంటూ పథకాలను గెలుస్తున్నారు. అలా దుబాయ్, బెల్జియం మొదలగు పలు దేశాల్లో జరిగిన అంతర్జాతీయ కార్ రేస్ పోటీల్లో పాల్గొన్నారు. కాగా ప్రస్తుతం దుబాయిలోని అబుదాబిలో జరగనున్న కార్‌రేస్ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధం అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అజిత్‌ను అబిదబిలో కలవడానికి మన సినీ స్టార్స్ క్యూ కడుతున్నారు. ఇప్పటికే నటుడు శింబు, సంగీత దర్శకుడు అనిరుద్, జీవి.ప్రకాశ్‌కుమార్, దర్శకుడు వెంకట్‌ప్రభు, మాదవన్, నటి నయనతార, శ్రీలీల వంటి పలువురు అజిత్‌ను కలిసి తమ అనందాన్ని వ్యక్తం చేయడంతో పాటూ శుభాకాంక్షలు తెలిపారు. తాజాగా నటుడు శివకార్తీకేయన్ ప్రత్యేకంగా దుబాయ్‌కి వెళ్లి అజిత్‌ను కలిశారు. అక్కడ వారు దిగిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా ఇటీవల నటుడు అజిత్ కథానాయకుడిగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. కాగా తాజాగా ఆ చిత్ర దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలోనే మరో చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నారు.ఈ చిత్రం త్కరలోనే సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. ఈచిత్రం కోసం ఆయన అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు.

## నగలు గిఫ్ట్.. ముందు ఎవరు ప్రపోజ్ చేశారంటే?




**ప్రేమికుల దినోత్సవం ఫిబ్రవరి 14 అయినప్పటికీ వారం రోజుల ముందే సందడి మొదలవుతుంది. రోజ్‌డే, ప్రపోజ్ డే, చాక్లెట్ డే, టెడ్డీ డే.. అంటూ ఫిబ్రవరి 7 నుంచే రోజుకో రకమైన సెలబ్రేషన్స్ జరుపుకుంటారు. అలా ఫిబ్రవరి 8న ప్రపోజ్ డే. ఈ క్రమంలో బాలీవుడ్ జంట కరీనా కపూర్- సైఫ్ అలీఖాన్ తమలో ఎవరు ముందుకుగా ప్రపోజ్ చేశారో వెల్లడించారు.**

**నగలు బహుమతి**

వీరిద్దరూ జంటగా వోగ్ ఇండియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా అనేక ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కరీనా కపూర్ మాట్లాడుతూ నా బర్త్‌డే, పెళ్లిరోజుకు సైఫ్ జ్యువెలరీ గిఫ్ట్‌గా ఇస్తుంటాడు అంది. ఇంతలో సైఫ్ కలగజేసుకుంటూ ఏదైనా గొప్ప విజయం సాధించినప్పుడు కూడా తనకు బహుమతులిస్తుంటాను అని చెప్పాడు. ఐ లవ్యూ ఎవరు ముందుగా చెప్పారన్న ప్రశ్నకు.. కరీనా అది నేనే అయ్యుంటుంది. అతడు నన్ను ఇబ్బంది పెట్టకూడదనే చూస్తాడు. కాబట్టి నేనే సాహసం చేసి చెప్పుంటాను అంది. అందుకు సైఫ్.. ఇది నిజంగా బాగుంది, నాకైతే ఎవరు ముందు ప్రపోజ్ చేశారన్న విషయం అసలు గుర్తేలేదు అన్నాడు. సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్ 2008లో వచ్చిన తషాన్ సినిమా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. 2012లో పెళ్లి చేసుకున్నారు. వీరికి కుమారులు తైమూర్, జే సంతానం. కాగా సైఫ్ అలీ ఖాన్‌కు ఇది రెండో పెళ్లి కావడం గమనార్హం. గతంలో సైఫ్.. అమృత సింగ్‌ను పెళ్లి చేసుకోగా వీరికి సారా అలీ ఖాన్, ఇబ్రహీం అలీ ఖాన్ జన్మించారు. ఈ దంపతుల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో 2004లో విడిపోయారు.

## క్రేజీ సీక్వెల్ ఆవేశం 2 వచ్చేస్తుంది..



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం. రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్‌నజ్రియా నజీమ్, అనన్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

## అల్లు అర్జున్ చేతికి గీతా ఆర్ట్స్..!




గీతా ఆర్ట్స్.. 1972లో అల్లు అరవింద్ స్థాపించిన అగ్రశ్రేణి చలనచిత్ర నిర్మాణ సంస్థ.. గీతా ఆర్ట్స్ పేరు వెనుక మహా నటుడు అల్లు రామలింగయ్య ఉన్నారు. భగవద్గీత సారాంశం నచ్చి ఆ పేరు పెట్టారు. గత ఐదు దశాబ్ధాలుగా వందల సంఖ్యలో ఈ బ్యానర్‌లో ఉపాధి పొందారు, పొందుతున్నారు. ఈ బ్రాండ్ కేవలం సినిమా రంగానికే పరిమితం కాలేదు. థియేటర్లు, పంపిణీ, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల్లోకి కూడా విస్తరించింది. గీతా ఆర్ట్స్ సంస్థను అల్లు అరవింద్ 50 సంవత్సరాల తరబడి కష్టపడి నిర్మించారు. ఈ కంపెనీకి ఆయన కుమారులు అల్లు బాబీ, అల్లు అర్జున్, అల్లు శిరీష్ వారసులు ఉన్నప్పటికీ గతంలో ఎవరూ రోజువారీ నిర్వహణలో చురుకుగా పాల్గొనలేదు. వ్యాపార పనులన్నీ కూడా అల్లు అరవింద్‌నే చూసుకునేవారు. గీతా ఆర్‌ట్స్‌కు సంబంధించి ప్రతి విభాగంలో సమర్థులైన వ్యక్తులను నియమించుకోవడంతో అల్లు అరవింద్ సక్సెస్ అయ్యారు. దీంతో వ్యక్తిగతంగా ప్రతిపనిలో వారి అవసరం అంతగా కనిపించలేదని చెప్పాలి. ఆపై వారి ఫ్యామిలీ మెంబర్, చిరంజీవి తోడల్లుని కుమార్తె విద్య ఈ నిర్మాణ సంస్థలో కీలక పాత్ర పోషించడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు.అల్లు అరవింద్ స్థాపించిన వ్యాపార కార్యకలాపాలన్నీ కూడా ఇప్పుడు అల్లు అర్జున్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే గీతా అర్‌ట్స్‌కు సంబంధించి పలు నిర్ణయాలను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. అతను మొత్తం స్థాయిలో సంస్థను పర్యవేక్షిస్తున్నారు. రోజువారీ చర్చలకు బదులుగా తరచూ సమీక్ష సమావేశాలు, ప్రణాళికలతో పాటు వ్యాపార అభివృద్ధికి సంబంధించిన ప్రధాన నిర్ణయాలు తీసుకోవడంలో పాల్గొంటున్నారని టాక్.. గీతా అర్‌ట్స్‌లోకి బన్నీ ప్రవేశం తర్వాత, కొన్ని మార్పులు జరిగినట్లు సమాచారం. తమ సంస్థలో చాలా కాలంగా పనిచేస్తున్న సహచరులకు సరైన గౌరవం ఇస్తూనే యువ టాలెంట్‌ను కూడా సంస్థలోకి తీసుకువచ్చారట. 50 ఏళ్లుగా వ్యాపారంలో బిజీగా గడిపేసిన అల్లు అరవింద్‌కు ఇప్పుడు కాస్త ఉపశమనం లభించినట్లు టాక్. అల్లు అర్జున్ ఎంట్రీ ఇప్పటికే ఆలస్యమైనప్పటికీ, తన తండ్రి నిర్మించిన వ్యాపారా సామ్రాజ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బలమైన నిర్ణయాలే బన్నీ ముందుకు రావడం సానుకూల చర్యగా విశ్లేషకులు అంటున్నారు.

## స్పిరిట్ రూమర్లకు చెక్..

### ప్రకాష్ రాజ్ క్లారిటీతో కన్‌ఫ్యూజన్ క్లియర్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ - దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమా అనౌన్స్ అయిన రోజు నుంచే ఈ ప్రాజెక్ట్ చుట్టూ సోషల్ మీడియాలో ఏదో ఒక వార్త హల్‌చల్ చేస్తూనే ఉంది. ముఖ్యంగా నటీనటుల ఎంపిక, కథా నేపథ్యం, షూటింగ్ అప్‌డేట్స్ వంటి అంశాలపై రోజుకో రూమర్ వినిపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న తరుణంలో గత కొద్ది రోజులుగా ఓ నెగెటివ్ ప్రచారం జోరందుకుంది. సెట్స్‌లో గొడవలు జరిగాయని, ఒక స్టార్ నటుడు ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడని, దర్శకుడు-నటుడి మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చాయని సోషల్ మీడియాలో కథనాలు వైరల్ అయ్యాయి. ఈ వార్తలతో అభిమానుల్లో కొంత గందరగోళం నెలకొంది. అయితే ఈ రూమర్లకు చెక్ పెడుతూ ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ స్వయంగా స్పందించడం విశేషం. తాను 'స్పిరిట్' సినిమా నుంచి తప్పుకున్నట్లు వస్తున్న వార్తలను పూర్తిగా ఖండించారు. అసలు తన సన్నివేశాల షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదని, అలాంటప్పుడు ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అయ్యాడని ఎలా ప్రచారం చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాట్సాప్ ఫ్యాక్టరీల్లో కట్టుకథలు సృష్టించడం మానుకోవాలని కూడా ఘాటుగా స్పందించారు.ప్రకాష్ రాజ్ ఇచ్చిన ఈ స్పష్టతతో వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లైంది. ఆయన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఫ్యాన్స్‌కు రిలీఫ్ ఇచ్చింది. ప్రభాస్ లాంటి భారీ స్టార్ సినిమాలో ప్రకాష్‌రాజ్ వంటి అనుభవజ్ఞుడైన నటుడు ఉండటం సినిమా బలాన్ని మరింత పెంచుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## మరోసారి భయపెట్టబోతున్న ఆది సాయికుమార్!

'శంబాల' చిత్రంతో రీసెంట్‌గా ఆది సాయి కుమార్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. మరోసారి అద్భుతమైన కథతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆది సాయికుమార్ హీరోగా, గ్లామరస్ హీరోయిన్ వేదిక హీరోయిన్‌గా నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'జంగిల్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సరికొత్త కథనం, ఒళ్లు గగుర్పొడిచే నేపథ్యం, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందింది అని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ చిత్రాన్ని ఫైడే పిక్చర్స్ బ్యానర్ మీద రాఘవ రెడ్డి పబ్బతి ప్రతిష్ఠాత్మకంగా తెలుగులో విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. థియేట్రికల్, శాటిలైట్, డిజిటల్ రైట్స్‌తో పాటు అన్ని హక్కులను ఫైడే పిక్చర్స్ స్వాధీనం చేసుకోవడం విశేషం. అతి త్వరలోనే గ్రాండ్ రిలీజ్ ప్లాన్ చేస్తోంది టీం. ప్రస్తుతం 'జంగిల్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఫైనల్ వీఎఫ్ఎక్స్ వర్క్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మూవీలో ఆది సాయికుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే వేదిక పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. హారర్‌తో పాటు సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రేక్షకులను చివరి వరకు కట్టిపడేస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ట్రైలర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇకపై కంటిన్యూగా అప్డేట్‌లను ఇస్తామని టీం చెబుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com